డాక్టర్ వై.షేక్ ఆధ్వర్యంలో వైసీపీలోకి డాక్టర్లు

విశాలాంధ్ర-గుంటూరు : వైఎస్సార్‌సీపీ డాక్టర్స్ సెల్ గుంటూరు జిల్లా అధ్యక్షులు డాక్టర్ వై.షేక్ ఆధ్వర్యంలో వైసీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వర ప్రసాద్ సమక్షంలో సుమారు 100 మంది డాక్టర్లు ఆదివారం వైసీపీలో చేరారు. స్థానిక వైసీపీ ప్రాంతీయ కార్యాలయంలో డాక్టర్ వై.షేక్ నేతృత్వంలో 'జగనన్న పాలనలో వైద్య రంగ సంస్కరణలు' అనే అంశంపై ఆదివారం సభ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ సురేంద్ర రెడ్డి, డాక్టర్ అయేషా, డాక్టర్ రాజా, డాక్టర్ కోటేశ్వరరావు, డాక్టర్ ఆదిత్యమని తదితరులు వైసీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు ఎండీ ముస్తఫా, డాక్టర్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ అశోక్ రెడ్డి, ఆరోగ్యశ్రీ అధికారి డాక్టర్ అశోక్, రాష్ట్ర వైద్య విభాగ సెక్రటరీ డాక్టర్ శివరామిరెడ్డి, జోనల్ ఇన్‌చార్జ్ డాక్టర్ మహబూబ్ బాషా, డాక్టర్ జాన్ బాబు, వికలాంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు నిత్యావసరాల పంపిణీ

విశాలాంధ్ర-గుంటూరు : శ్రీ హనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షులు మామిడి మురళీకృష్ణ ఆధ్వర్యంలో పలువురు దాతల సహకారంతో స్థానిక కొత్తపేటలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం 50 మంది వృద్ధులు, దివ్యాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ బియ్యం, కందిపప్పు, చింతపండు, గోదుమపిండి, సేమియా, పంచదార, బెల్లం, నూనె, పసుపు, కుంకుమ తదితర 10 రకాల వస్తువులతో కూడిన నిత్యావసరాలను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పాలేపల్లి సుబ్రహ్మణ్యం, మాదాల ప్రకాష్, ఎస్‌వీ రమణ, మురళీ సాయి, పలకలూరి శివరావు, వి.త్రినాథ్, మామిడి ప్రతీక్, శ్రావణ్, పాలేపల్లి లహరి పాల్గొన్నారు.

ఒకే రోజున 50 ఎక్స్‌పీరియన్స్ సెంటర్లను ప్రారంభించిన ఓలా

గుంటూరు: భారతదేశంలో అతిపెద్ద ఈవీ కంపెనీ ఓలా ఎలక్ట్రిక్ దేశవ్యాప్తంగా ఒకే రోజున 50 ఎక్స్‌పీరియన్స్ సెంటర్లను ప్రారంభించింది. భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాల పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ఈ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ వినియోగదారులకు వాహనాలు, తన సేవలను మరింత అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు, భారతదేశం వ్యాప్తంగా అంతటా ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లను ప్రారంభించేందుకు ఉత్సాహాన్ని చూపిస్తోంది. నాయుడుపేటలోని బ్రహ్మం గారి వీధిలో మొదటి ఓలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించడం ద్వారా గుంటూరులో తన డీ2సీ అడుగుజాడను విస్తరించామని కంపెనీ ప్రకటించింది.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ ప్రార్థనలు

విశాలాంధ్ర-పొన్నూరు : ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకొని పొన్నూరు పట్టణ, మండలం పరిధిలోని క్రైస్తవ దేవాలయాల్లో ఆదివారం ఘనంగా ఈస్టర్ పండగ(పునరుద్ధాన దినం)ను క్రైస్తవులు జరుపుకున్నారు. తెల్లవారుజామున క్యాండిల్ ప్రదర్శనతో తమ పితరుల సమాధుల వద్దకు చేరుకొని ముందుగానే అలంకరించుకున్న సమాధుల వద్ద పుష్పాలు, సుగంధ ద్రవ్యాలు వెలిగించి క్రీస్తు పునరుద్ధానుడై లేచాడని లేఖనముల ప్రకారం ప్రార్థనలు చేశారు. ఉదయం 10 గంటలకు ఆయా దేవాలయాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాత పొన్నూరు టౌన్ లూథరన్ చర్చిలో రెవరెండ్ పాస్టర్ కనపర్తి ఆశీర్వాదం క్రీస్తు పునరుద్ధాన పండుగ విశిష్టతను భక్తులకు బోధించారు. టౌన్ లూథరన్ చర్చికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రార్థనలు చేశారు.

సీఆర్ ఆశయాలను సాధిస్తాం...

విశాలాంధ్ర-కారంపూడి: భారత స్వాతంత్ర్య సమర యోధుడు, సామ్యవాది కామ్రేడ్ చంద్ర రాజేశ్వర రావు ఆశయాలను సాధిస్తామని సీపీఐ మండల కార్యదర్శి షేక్ సైదా అన్నారు. ఆదివారం ఆదినారాయణకాలనీలోని ఆయన నివాసం వద్ద చంద్ర రాజేశ్వరరావు 29వ వర్ధంతిని పార్టీ కార్యకర్తలు, నాయకులు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా విప్లవ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సైదా మాట్లాడుతు సీఆర్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆయన చూపిన బాటలో నడవాలన్నారు. సిఆర్ సంపన్న కుటుంబంలో పుట్టి పేద ప్రజల కోసం ఎన్నో ఉద్యమాలు చేశారన్నారు. ఆయన ఆస్తిని పేద ప్రజలకు దానం చేశారన్నారు. సీఆర్‌ను ఆర్డర్ ఆఫ్ లెనిన్, ఆర్డర్ ఆఫ్ డెమిట్రోవ్, చెకోస్లోవేకియా వంటి బిరుదులతో పలు దేశాలు సత్కరించాయన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి సూరె హనుమంతరావు, ఒప్పిచర్ల కార్యదర్శి టందూరి శ్రీను, గాలం శ్రీను, చెన్నయ్య, నూనె వెంకటేశ్వర్లు, శశిదేవి, సుభాని, జింకల వెంకటరమణ, మణిదీపు పాల్గొన్నారు.

ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-గుంటూరు : ఎన్ఎస్‌యూఐ 53వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను గుంటూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎన్ఎస్‌యూఐ నగర అధ్యక్షులు షేక్ కరీం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి, డీసీసీ అధ్యక్షులు లింగంశెట్టి ఈశ్వరరావులు హాజరై ఉక్కు మహిళ ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు లీగల్ సెల్ చైర్మన్ సుధీర్, యువజన కాంగ్రెస్ సందీప్, పాలపాటి అనిల్, గుంటూరు ఎన్ఎస్‌యూఐ నాయకులు మదన్, తిరుమలరావు, సుమంత్, ఏసు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



విశాలాంధ్ర-దుగ్గిరాల : చింతలపూడి గ్రామంలో షేకెనా ప్రార్థన మందిరంలో ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక సంఘ కాపరి మండేపూడి ఐజయ్య ఆధ్వర్యంలో జరిగింది. ఆదివారం తెల్లవారు జామున సమాధుల దగ్గరికి వెళ్లి పూలు, కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. ఉదయం మందిరంలో స్థానిక పాస్టర్ ఆధ్వర్యంలో ఈస్టర్ ప్రార్థన దేవునికి మహిమకరంగా జరిగింది. ఈ సందర్భంగా పాస్టర్ ఐజయ్య ఈస్టర్ సందేశం అందిస్తూ యేసుక్రీస్తు ఆయన దేవుడు గనుక మరణాన్ని జయించి తిరిగి లేచాడని ప్రపంచంలో ఆయన సమాధి తప్ప వేరే సమాధి ఏది ఖాళీగా లేదని అందుకే ఆయన లోక రక్షకుడని తెలియజేశారు. ఈ ప్రాంతంలో విశ్వాసులు అందరు పాల్గొని ప్రార్థనలు చేశారు. అనంతరం సిస్టర్ బ్లెస్సి ముగింపు ప్రార్థనలు చేశారు.కాగితాల ప్రసన్న, ప్రశాంతి, అమూల్య, ప్రియదర్శిని, అక్షయ, సత్యవతి, పి.అన్నపూర్ణ, పి.లక్ష్మి, శ్రీదేవి, పుల్లమ్మ, ఛార్మి, సామ్రాజ్యం, పి.మహేష్, బి.వెంకటేశ్వరరావు, గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సు కోసం పోరాటాలు నిర్వహించిన యోధుడు సీఆర్

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల

విశాలాంధ్ర-తెనాలి : పదవులు ఆశించకుండా ప్రజా శ్రేయస్సు కోసం ప్రజా పోరాటాలు చేసిన భారత కమ్యూనిస్టు పార్టీ పోరాట యోధులలో ఒకరిగా కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు(సీఆర్) నిలుస్తారని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో తెనాలి గాంధీనగర్‌లో సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జంగాల మాట్లాడుతూ కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు 29వ వర్ధంతి కార్యక్రమాన్ని పార్టీ కార్యాలయంలో నిర్వహించారని తెలియజేశారు. తన డాక్టర్ వృత్తిని సైతం విడిచిపెట్టి కమ్యూనిస్టు భావజాలాన్ని ప్రజలలోకి తీసుకెళ్లే విధంగా ప్రజా సమస్యలపై పోరాటాలను సీఆర్ కొనసాగించారని గుర్తుచేశారు. తనకున్న 400 ఎకరాలు పొలాన్ని సైతం పేద ప్రజలకు పంచిపెట్టి చల్లపల్లి రాజా 400 ఎకరాల భూమిని పోరాడి పేద ప్రజల పరంచేశారని అన్నారు. దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మికులకు సాగు భూముల కోసం ప్రత్యక్షంగా పాల్గొని పోరాటాన్ని సాగించిన వ్యక్తి సీఆర్ అని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెంచలయ్య మాట్లాడుతూ తెనాలిలో ఈ నెల 10వ తేది నుంచి మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో కళాకారుల శిక్షణా శిబిరం పట్టణ రంగస్థలం కళాకారుల భవనంలో నిర్వహించారని తెలియజేశారు. కళాకారుల శిబిరాన్ని ప్రతి ఒక్క కళాకారుడు ఉపయోగించుకునే విధంగా ముందుకు తీసుకెళ్తారని భావిస్తున్నారని అన్నారు. దేశంలో నరేంద్ర మోదీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లే విధంగా ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు ప్రచార యాత్రలో ఈ శిక్షణా శిబిరం ఎంతో ఉపయోగకరంగా జరగబోతుందని తెలిపారు. ప్రతి ఒక్క కళాకారుడు విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇప్టా జాతీయ కార్యదర్శి గని, సీపీఐ తెనాలి నియోజకవర్గ కార్యదర్శి చెరుకుపల్లి సింగారావు, పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్ బాబు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పాశం వెంకటేష్, పట్టణ కార్యదర్శి సాయి, ఏఐవైఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి పల్నాటి నాగరాజు, పట్టణ కార్యదర్శి బిల్లా రాజేష్, పట్టణ సహాయ కార్యదర్శి కుంభ రవితేజ, వైఎఫ్ నియోజకవర్గ కోశాధికారి పొట్లూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలపై పాదయాత్ర

జయప్రదం చేయాలని వామపక్షాల పిలుపు

విశాలాంధ్ర-మంగళగిరి : సీపీఐ-సీపీఎం జాతీయ సమితి పిలుపుమేరకు ప్రజాస్వామ్యాన్ని కాపాడడం కోసం రాజ్యాంగాన్ని రక్షించడం కోసం, మతోన్మాదం నుంచి దేశాన్ని రక్షించడం కోసం, అధిక ధరాభారాలతో అల్లాడిపోతున్న ప్రజానీకాన్ని చైతన్యవంతం చేసి పోరాటాలకు సిద్ధం చేయడం, ప్రజా వ్యతిరేక ప్రభుత్వాలను ఇంటికి సాగనంపడం కోసం ఈ నెల 14 డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించి సభలు నిర్వహించి 14 నుంచి ఈ నెల 30వ తేదీ వరకు మంగళగిరి నియోజకవర్గం వ్యాప్తంగా జరిగే వామపక్షాల ఇంటింటి ప్రచార యాత్రను జయప్రదం చేయాలని సీపీఐ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య ప్రజలకు విజ్ఞప్తిచేశారు. మంగళగిరి పట్టణంలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్‌లో ఆదివారం జరిగిన సీపీఐ నియోజకవర్గ సమితి సమావేశంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య, సీనియర్ నాయకులు పి.బాలకృష్ణ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం నియంతృత్వ విధానాలతో దేశంలో ఉన్న బీజేపీయేతర ప్రభుత్వాలపై ఉక్కుపాదం మోపుతూ గవర్నర్లతో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలను కదలకుండా అనేక ఇబ్బందులు కలిగిస్తూ ప్రభుత్వాలు సాఫీగా నడవడంలో సహకరించకుండా అప్రజాస్వామికంగా వ్యవహరిస్తూ చట్ట ప్రకారం కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు విడుదల చేయకుండా అనేక ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌కు విభజన హామీల ప్రకారం రావలసిన నిధులను విడుదల చేయకుండా, పోలవరం ప్రాజెక్టు పనులను ముందుకు కదలనీయకుండా రాష్ట్ర అభివృద్ధికి రాజధాని కోసం వెనుకబడిన జిల్లాల ప్రాంతాల అభివృద్ధి నిధులను విడుదల చేయకుండా మోకాలడ్డుతూ రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీసే విధానానికి పూనుకుందని ఆయన అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోగా రాష్ట్రంలో ఉన్న ఏకైక భారీ ఉక్కు పరిశ్రమను కార్పొరేట్ కంపెనీలకు బడా పెట్టుబడిదారులకు, అలాగే దేశంలోనే అనేక ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ, అదానీ లాంటి వారికి ఉపయోగపడే విధంగా సముద్ర తీర ప్రాంతాలు పోర్టులు, బొగ్గు గనులు, ఇన్సూరెన్స్ కంపెనీలు ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పేస్తోందని విమర్శించారు. రాష్ట్ర ప్రజలందరూ గత రెండు సంవత్సరాలుగా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పోరాడుతుంటే ఏమాత్రం వెనుకకు తగ్గని కేంద్రం ప్రైవేటీకరణ వైపు ముందుకు అడుగులు వేస్తోందన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ధరలు మొత్తం తగ్గిస్తానని నల్లధనాన్ని వెనుకకు తీసుకొస్తానని రైతాంగానికి రెట్టింపు ఆదాయం చేస్తానని సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని, దేశం మొత్తం ప్రజానీకం అధిక ధరాభారాలతో అల్లాడిపోతున్నారని పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచి తమాషా చూస్తున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్రంలో జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం 25 మంది ఎంపీలను ఇస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెస్తానని అందరికీ ఉద్యోగాలు సాధిస్తానని రాష్ట్రానికి అమరావతి రాజధానిగా ఉంటుందని రాష్ట్ర అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని చెప్పిన జగన్‌మోహన్ రెడ్డి ఢిల్లీ పెద్దల ముందు సాగిల పడుతున్నారని ఆయన విమర్శ చేశారు. రాష్ట్రంలో ప్రజలపై అధిక పన్నుల భారాలు మోపుతూ ఆర్టీసీ బస్సు చార్జీలు, కరెంటు చార్జీలు, ఇంటి పన్నులు నీటి పన్నులు చివరకు చెత్త పన్నులు కూడా పెంచి ప్రజలు నడ్డి విరిగే విధంగా పన్నుల భారాలు మోపారని అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిధులు తేలేక కేంద్రాన్ని నిలదీయలేక రాష్ట్ర అభివృద్ధి నిధులు అడగలేక కేంద్రం ముందు చతికిలబడ్డదని అన్నారు. అభివృద్ధిలో రాష్ట్రం పూర్తిగా వెనుకబడిందని పరిశ్రమలు రాక పారిశ్రామిక సంస్థలు లేక చదువుకున్న విద్యార్థులకు, నిరుద్యోగులకు ఉద్యోగాలు లేక రాష్ట్రంలో నిరుద్యోగం తాండవిస్తోందన్నారు. రాష్ట్రంలో ఉన్న టిడ్కో గృహాలను లబ్ధిదారులకు పంపిణీ చేయలేదని, జగనన్న కాలనీల పేరుతో ఏ ఒక్క పేదవారికి ప్రభుత్వ పరంగా ఇల్లు కట్టి ఇవ్వలేదని ఆయన విమర్శించారు. అర్హులైన పేదలందరికీ ప్రభుత్వమే పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అరాచక పాలన తాండవిస్తోందని ఎదిరించిన వారిపై ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ జైల్లో వేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ అక్రమ కేసులపై నిర్బంధాలపై ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా కంటక ప్రజా వ్యతిరేక ప్రజాస్వామ్య రాజ్యాంగ విరుద్ధ విధానాలపై ప్రజలు కార్మికులు కష్టజీవులు రైతాంగం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు జరిగే వామపక్షాల ప్రజా చైతన్య యాత్రలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, తాడేపల్లి సహాయ కార్యదర్శి తుడుమెళ్ళ వెంకటయ్య, జవ్వాది సాంబశివరావు, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లలమర్రి నాగేశ్వరరావు, ఉడత శ్రీనివాసరావు, సీపీఎం నాయకులు గని తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు వర్ధంతి

విశాలాంధ్ర-పొన్నూరు : కమ్యూనిస్టు పార్టీ అగ్ర నాయకులు, భూ పోరాట యోధులు, ఆర్డర్ ఆఫ్ లెనిన్ అవార్డు గ్రహీత కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు 29వ వర్ధంతి స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు అధ్యక్షత వహించగా సీపీఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ ఆయన దేశవ్యాప్తంగా పర్యటించి బలమైన కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించి ప్రజా పోరాటాలకు నాయకత్వం వహించి జాతీయ అంతర్జాతీయ రాజకీయరంగంలో అరుదైన గౌరవాన్ని సంపాదించుకున్న నాయకుడు అన్నారు. భూమిలేని నిరుపేదలకు వేల ఎకరాలు భూ పోరాటం ద్వారా పంచిన ఘనత చంద్ర రాజేశ్వరరావుకు దక్కుతుందని అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ కార్యదర్శిగా 25 సంవత్సరాల పాటు సుదీర్ఘ సేవలందించిన త్యాగధనులు కామ్రేడ్ రాజేశ్వరరావు అన్నారు. ఆయన ఆడంబరమెరుగని ఆదర్శ నేత అని కొనియాడారు. ఏఐటీయూసీ గుంటూరు జిల్లా కన్వీనర్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు దేశంలోని పేద ప్రజలకు కార్మిక వర్గానికి ఎనలేని సేవలందించారన్నారు. చంద్ర రాజేశ్వరరావు ఆయన వీలునామాలో నేను ఎవరికి ఏమి ఇవ్వవలసిన అవసరం లేదని నేనుఎవ్వరికి బాకిలేనని నేనువ్రాసిన పుస్తకాలు గ్రంథాలయాల్లో పెట్టి పార్టీ కేడర్ చేత చదివించాలని, నేనూ ఎక్కడ చనిపోతే అక్కడే నన్ను ఖననం చేయాలని నాకు సేవలు చేసిన డాక్టర్ల బృందంకు పార్టీ కేడర్‌కు ధన్యవాదాలు, ఇక నా వంటిపై బట్టలు జత చెప్పులు మిగిలినవి ఎవరికైన ఉపయోగపడితే ఇవ్వండి అని తన వీలునామా వ్రాసిన మహనీయుడిని అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి జంపని గోవిందరాజు, గుంటూరు ఏడుకొండలు చారి, శ్రీరాములు, సీతారామయ్య, సీపీఐ నాయకులు పాటిబండ్ల డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

భూపోరాట యోధుడు చంద్ర రాజేశ్వరరావు

విశాలాంధ్ర-గుంటూరు : భూపోరాటాలు నిర్వహించి భూమి లేని పేదలకు పంచడమే కాకుండా తనకు వారసత్వంగా సంక్రమించిన భూమిని సైతం పేద ప్రజ లకు పంచిన యోధుడు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు(సీఆర్) అని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి అన్నారు. స్థానిక చంద్ర రాజేశ్వరరావు నగర్‌లో ఆదివారం జరిగిన ఆయన 29వ వర్ధంతి కార్యక్రమంలో కోట మాల్యాద్రి మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీకి ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘకాలం బాధ్యతలు నిర్వహించి పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేశారని గుర్తుచేశారు. హిందూ మతోన్మాదులు బాబ్రీ మసీద్ వివాదం సృష్టించిన సమయంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో జనసేవాదళ్ కార్యకర్తలను సమీకరించి మత సామరస్యం కోసం నిలిచిన గొప్ప వ్యక్తి చంద్ర రాజేశ్వరరావు అని కొనియాడారు. అలాగే మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా సీఆర్ నాయకత్వం వహించడమే కాకుండా చివరి వరకు కమ్యూనిస్టుగా ఉన్నారని అన్నారు. సీఆర్ చూపిన బాటలో కొనసాగుతూ సీఆర్ వర్ధంతి సందర్భంగా పోరాటాలకు పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సీనియర్ నాయకులు నూతలపాటి వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు ఎస్.దేవా నాయక్, నగర ఏఐవైఎఫ్ అధ్యక్షులు చిన్నబోతుల శ్రీనివాసరావు, బోసు, హుస్సేన్ బీ పాల్గొన్నారు.

ప్రచార పాదయాత్రలో భాగస్వాములు కావాలి

విశాలాంధ్ర-గుంటూరు : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక నిరంకుశ పాలన విధానాలపై సీపీఐ-సీపీఎంల ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ నుంచి జరుగు ప్రచార పాదయాత్ర కార్యక్రమాన్ని నగరంలోని ప్రజలు జయప్రదం చేయాలని సీపీఐ, సీపీఎం నగర కార్యదర్శులు కోట మల్యాద్రి, కె.నళినీకాంత్ పిలుపునిచ్చారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లో ఆదివారం ప్రచార ఆందోళన కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత పారిశ్రామికవేత్తలైన అధానీ, అంబానీలు ప్రపంచ కుబేరులుగా తయారయ్యారని అన్నారు. ఈ సందర్భంగా బీజేపీ ప్రభుత్వ నిరంకుశ పాలనపై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు, అలాగే బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న మతోన్మాద, మైనార్టీలు, దళితులపై దాడులు, ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలులో జరిగిన అన్యాయం, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ తదితర సమస్యలపై ఈ నెల 14వ తేదీ అంబేద్కర్ జయంతి సందర్భంగా గుంటూరు నగరంలో ప్రచార పాదయాత్రలు ప్రారంభం చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం నాయకులు నూతలపాటి చిన్న, కె.శ్రీనివాస్ రావు, రావుల అంజిబాబు, బి.ముత్యాలరావు, ఆకిటి అరుణ్ కుమార్, చల్లా మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే వైసీపీ బలం: అప్పిరెడ్డి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : కార్యకర్తలే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలమని శాసనమండలి సభ్యులు, పార్టీ కేంద్ర కార్యాలయం పర్యవేక్షకులు లేళ్ళ అప్పిరెడ్డి అన్నారు. జగనన్నా నువ్వే మా భవిష్యత్తు కార్యక్రమం గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని 39వ డివిజన్ గుజ్జనగుండ్లలో జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. అప్పిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని రాజకీయ పక్షాల టార్గెట్ ముఖ్యమంత్రి జగన్ ఒక్కరే నని, అయితే కార్యకర్తలే బలంగా...ప్రజలే బలగంగా...ముందుకు సాగుతున్న ఆయనను ఒంటరిగా ఎదుర్కొనే సత్తా ఏ ఒక్క పార్టీకి లేదన్నారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ గతంలో ఏ రాజకీయ పార్టీ కూడా తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం ఇచ్చిన హామీలు అమలు చేసిన చరిత్రే లేదని, టీడీపీ అయితే అధికారంలోకి రాగానే తమ పార్టీ వెబ్‌సైట్ నుంచి ఏకంగా ఎన్నికల మ్యానిఫెస్టోనే ఎత్తి పారేసిందని ఎద్దేవా చేశారు. అసలు 98 శాతం హామీలు అమలు చేసిన ప్రభుత్వం దేశంలో ఎక్కడైనా ఉందా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పినవే కాక చెప్పని అనేక కార్యక్రమాలు చేపట్టిన ఘనత జగన్‌కు మాత్రమే దక్కుతుందని కొనియాడారు. కార్పొరేటర్ షేక్ జుమ్మాబీ మార్కెట్ బాబు, వైసీపీ నేతలు ఉడతా కృష్ణ, ఏవీఎల్ మధు, పిల్లుట్ల మోహనరావు, డివిజన్ పార్టీ అధ్యక్షుడు షఫి, అజీజ్, కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ(ఆచారి), స్థానిక సచివాలయ కన్వీనర్లు షేక్ బాబు, మున్నా, పోగుల వెంకటేశ్వర్లు, షేక్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

షుగర్, బీపీ, థైరాయిడ్‌లపై అవగాహన ఉండాలి: డా॥ పద్మలత

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : నేటి ఆధునిక జీవన శైలిలో మనిషిని అతలాకుతలం చేస్తున్న షుగర్, బీపీ, థైరాయిడ్‌లపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ పి.పద్మలత పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో ఆరోగ్య సభ సంస్థ సీనియర్ సభ్యులు కళ్యాణం చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ పద్మలత మాట్లాడుతూ నేటి జీవన విధానంలో శారీరక శ్రమతగ్గి ఆహార మోతాదు ఎక్కువ అవ్వటం వలన సమతుల్యం లోపించి వస్తున్న షుగర్, బీపీ, థైరాయిడ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. షుగర్ వ్యాధి ఉన్న వాళ్ళల్లో రక్తంలో గ్లూకోజ్ శాతం అధికంగా ఉంటుందన్నారు. వీరిలో ఇన్సులిన్ ఉత్పత్తి తగ్గిపోతుందని, డయాబెటిస్ వల్ల మూత్రపిండాలు, నరాలు, గుండె, రక్తనాళాలు, కళ్లు దెబ్బతింటాయని హెచ్చరించారు. మానసిక ఒత్తిడి వల్ల కూడా హార్మోన్ సమతుల్యం దెబ్బతిని షుగర్ వ్యాధి రావచ్చని, జన్యుపరంగా, వంశపారం పర్యంగా కూడా ఈ వ్యాధి రావచ్చని చెప్పారు. షుగర్, రక్తపోటు ఒకదానితో ఒకటి అంతర్గత సంబంధాలు కలవని, ఒకటి వస్తే రెండవది రావటానికి అవకాశలున్నాయన్నారు. తమ బరువును అదుపులో ఉంచుకోవటం కోసం రోజూ వ్యాయామం చేయాలని, మితమైన ఆహారంతో సంతృప్తిగా ఉండాలని డాక్టర్ పద్మలత సూచించారు. రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ యలమంచిలి శివాజీ మాట్లాడుతూ డాక్టర్ పద్మలత వైద్య రంగంలో మంచి పేరు తెచ్చుకున్నారని, అంకితభావం గల వైద్యులను తప్పక అభినందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శివరామిరెడ్డి, రాజన్‌బాబు, సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ముస్తఫా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఈస్టర్ పర్వదినం సందర్భంగా ఆదివారం గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా నగరంలోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. హిందూ కాలేజీ వద్ద వెస్ట్ ప్యారిష్ చర్చిలోనూ.. లాడ్జిసెంటర్‌లోని నార్త్ ప్యారిష్ చర్చిలోనూ...మాయా బజార్‌లోని ఈస్ట్ ప్యారీష్ చర్చిలను దర్శించి దైవ సహాయకులచే ఆశీర్వచనాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ ప్రపంచ మానవాళి కోసం ఏసుక్రీస్తు శిలువధారణ చేసిన మూడో రోజు పునరుర్థానుడైయ్యాడని తెలిపారు. మరణాన్ని జయించి మానవులందరికీ తన బోధనలు అందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అనిల్‌కుమార్, రాణా ప్రతాప్ తదితరులు ఉన్నారు.

ఉమా శంకర్ ఆధ్వర్యంలో బీజేపీలోకి పలువురు చేరిక

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆరవ మండలం బీజేపీ ఈస్ట్ కన్వీనర్ డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం బీజేపీలో పలువురు చేరారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు పాటిబండ్ల రామకృష్ణ, కో-కన్వీనర్ వనమా నరేంద్ర, గుంటూరు జిల్లా జనరల్ సెక్రెటరీ కుమార్ గౌడ్, మైనారిటీ అధ్యక్షులు భాషా, 6వ మండల అధ్యక్షులు సురేష్ కుమార్ జైన్, గౌస్‌ల సమక్షంలో వారిని పార్టీలోకి ఆహ్వానించి కండు వాలు వేశారు. అనంతరం పాటిబండ్ల రామకృష్ణ మాట్లాడుతూ పార్టీ బలోపేతా నికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో యూసఫ్, రఫీ, సురేష్, ఖాన్ పీరా, భాషా, మహేష్, సుబ్బారావు, షేక్ బుడ్డవల్లి, రఫీలు ఉన్నారు.

కోస్తాంధ్ర పద్మశాలి సంఘం ఇంజనీరింగ్ విభాగ అధ్యక్షులుగా అవ్వారు వంశీ

విశాలాంధ్ర-మంగళగిరి : కోస్తాంధ్ర పద్మశాలి సంఘం ఇంజనీరింగ్ విభాగం అధ్యక్షులుగా మంగళగిరికి చెందిన అవ్వారు వంశీకృష్ణను నియమించారు. గుంటూరు జిల్లా తెనాలి పద్మశాలి వెల్ఫేర్ అసోసియేషన్ కళ్యాణ మండపంలో ఆదివారం జరిగిన కోస్తాంధ్ర పద్మశాలి సంఘం విస్తృత స్థాయి సమావేశంలో కోస్తాంధ్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు జీవీ నాగేశ్వరరావు అవ్వారు వంశీకృష్ణకు నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత పద్మశాలి సంఘం జాతీయ కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి అందే జగదీష్, పద్మశాలి యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిరువీదుల కిరణ్, జొన్నాదుల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కులాలపై విషం చిమ్మటం మానుకోవాలి

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: వైసీపీ నేత, సినీ నటులు పోసాని కృష్ణ మురళి కులాల మీద విషం చిమ్మటం మానుకోవాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి కోవెలమూడి రవీంద్ర(నానీ) అన్నారు. మీడియాతో మాట్లాడుతూ తెలుగు చలనచిత్ర పరిశ్రమకు సంబంధించిన నంది అవార్డులను 'కమ్మ అవార్డులని', దర్శకులు కె.రాఘవేంద్రరావు సూచించిన వారికే చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అవార్డులు ప్రధానం చేసిందని 'పోసాని కృష్ణ మురళీ' వ్యాఖ్యలు చేయటం తగదని ఖండించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నంది అవార్డుల కమిటీ చైర్మన్‌గా వైసీపీ నేత గిరిబాబు, మరో వైసీపీ నేత జీవిత అనే విషయాన్ని పోసాని గుర్తుంచుకోవాలన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటి వరకు నంది అవార్డులు ప్రధానం చేయించారా అని కోవెలమూడి ప్రశ్నించారు. రాఘవేంద్రరావుపై పోసాని అవాకులు చవాకులు పేలుతున్నాడని, ముందు పోసాని తన స్థాయి తెలుసుకొని విమర్శలు చేస్తే బాగుంటుందన్నారు. ఎస్‌వీబీసీ చైర్మన్‌గా సేవలందించిన రాఘవేంద్రరావుపై చిన్న ఆరోపణ కూడా రాలేదన్నారు. జగన్ రెడ్డి నీకు ఒక పదవి విసిరేస్తే, ఆ పదవిని కాపాడుకోవడం కోసం, ఆయన మెప్పు కోసం నువ్వు పాకులాడుతున్నావు. తెలుగు వారు గర్వించదగ్గ వ్యక్తి రాఘవేంద్రరావు అన్న విషయం గుర్తెరిగి ఆయనకు నువ్వు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఏసు పునరుద్ధాన వేడుకలు

విశాలాంధ్ర-మేడికొండూరు : మందపాడు గ్రామంలోని పెంతకోస్టల్ హోలీనెస్ చర్చిలో ఆదివారం పాస్టర్ జక్రయ్య ఆధ్వర్యంలో క్రీస్తు పునరుద్ధాన వేడుకలు ఘనంగా నిర్వహించారు. నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం నేషనల్ వైస్ ఛైర్మన్ జమీల్ అహ్మద్ బేగ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'పునరుద్ధానమును, జీవమును నేనే... నా యందు విశ్వాసముంచి ప్రతివాడును చనిపోయినను బ్రతుకును... బ్రతికి నా యందు విశ్వాసముంచు ప్రతివాడును ఎన్నటికినీ చనిపోడు' అని ఏసు వాక్యాలను గుర్తుచేసుకోవాలని అన్నారు. ఈస్టర్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా జమీల్ అహ్మద్ బేగ్ దైవ సేవకులు జక్రియను శాలువాతో సత్కరించి, క్రీస్తు పునరుద్ధాన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఘనంగా ఈస్టర్ పర్వదినం

విశాలాంధ్ర-తాడికొండ : ఈస్టర్ పర్వదినాన్ని ఆదివారం క్రైస్తవ భక్తులు ఘనంగా జరుపుకున్నారు. పాపుల కోసం ఏసుక్రీస్తు సిలువలో మరణించి పునరుద్ధానుడైన సందర్భంగా క్రైస్తవులు ఈస్టర్ పండుగను జరుపుకుంటారు. చర్చిలలో వేకువ జామున ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. జయ జయ యేసు జయ యేసు జయ జయ క్రీస్తు జయ క్రీస్తు అంటూ కీర్తనలు ఆలకించారు. క్రైస్తవులు సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. తెలుగు బాప్టిస్ట్ చర్చి లూథరన్ ఆర్‌సీఎం తదితర చర్చిలలో ప్రార్థనలు జరిగాయి.

క్రీస్తు పునరుర్థానం మానవాళికి మరొక తరుణం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఏసుక్రీస్తు పునరుర్థానం మానవాళికి మరొక తరుణమని వెస్ట్ ప్యారిష్ చర్చ్ పాస్టర్ రెవరెండ్ సతీష్ బాబు పేర్కొన్నారు. ఏసుక్రీస్తు పునరుర్థానంలో మరణం ఓడిపోయిందన్నారు. దేవుని బిడ్డలైన ప్రతి ఒక్కరూ ఓర్పు, సహనం కలిగి ఉండాలని సూచించారు. ఈస్టర్ పండుగ సందర్భంగా ఆదివారం చర్చి ప్రాంగణానికి వేలాదిమంది భక్తులు విచ్చేసి ఒకరికొకరు ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అదేవిధంగా తొలుత పాస్టర్ సతీష్ బాబు భక్తులకు ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పాస్టర్ సతీష్‌బాబు మాట్లాడుతూ మహా శుక్రవారం రోజు మానవులందరి పాపములకై మరణించిన ప్రభువైన ఏసుక్రీస్తు మరణం జయించి తిరిగి లేచినటువంటి దినమును ఈస్టర్ అని పిలవబడటం జరుగుతుందని చెప్పారు. నేడు మనిషి పాపం, కల్మషం, వైషమ్యాలతో ఉన్నప్పుడు ప్రతి ఒక్కరు కూడా తమలో ఉన్న చెడు అలవాట్ల వలన మరణించాల్సి ఉంటుందని తెలిపారు. పునరుర్థానం అనేది ఒక మతానికి, ప్రాంతానికి, సంస్కృతికి సంబంధించినది కాదని, ఇది మానవాళి అందరికీ కూడా సంబంధించిన విషయమన్నారు. కార్యక్రమాలను చర్చి కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

CHANGE OF NAME

I, **SHIVANAGESHWARA RAO ADITHYA** (Old Name) S/o. **SANISETTY SIVA NAGESWARA RAO**, R/o. Flat No.103, Pamulapati Heights, 10/4 Line, Arundelpet, Near Tagoor Statue, Guntur - 522002, Guntur District, Andhra Pradesh, have changed my name to **SANISETTY ADITHYA.** Hereafter my name is known as **SANISETTY ADITHYA.**

విశాలాంధ్ర
పల్నాడు జిల్లా

వైద్యశిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-రొంపిచర్ల: సంతగు డిపాడు గ్రామంలో ఆదివారం నిర్వ హించిన ఉచిత మెగా వైద్యశిబిరా నికి విశేష స్పందన లభించింది. నెలవారి మెడికల్ క్యాంప్‌లో భాగం గా ఈ నెలలో నరసరావుపేటకు చెందిన స్కందన్ నేత్రాలయ వైద్యులు డాక్టర్ వై.ఫణీంద్రరెడ్డి పాల్గొని వైద్య సేవలు అందించారు. గ్రామంతో పాటు పరిసర గ్రామాలకు చెందిన 120 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కొంతమందికి కంటి పరీక్షలు నిర్వహించి కంటిపట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. వైద్యసేవలు అందించిన డాక్టర్ ఫణీంద్రరెడ్డిని, గ్రామానికి చెందిన వైద్యులు డాక్టర్ కోసూరు సుబ్బారావును మెడికల్ క్యాంప్ నిర్వహణ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. మెడికల్ క్యాంప్ నిర్వహణ కమిటీ సభ్యులు మామిళ్ళపల్లి ఆదిబాబు, బండారు పల్లి నాగేశ్వర రావు, అచ్చుల సుబ్బారావు, మోదుగుల కొండలు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

జగనన్నే మా భవిష్యత్

విశాలాంధ్ర-రెంటచింతల: రెంట చింతలలో ఆదివారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం లో మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న స్టిక్కర్ను తలుపుకు అంటించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి వివరించారు. వీరి వెంట ఎంపీపీ చౌడేశ్వరి , వైకాపా నేతలు మాజీ జెడ్పీటీసీ నవులూరి భాస్కరరెడ్డి, వెన్నా వెంకటేశ్వరరెడ్డి, గొట్టం బ్రహ్మారెడ్డి, మద్దిరాల కృష్ణారెడ్డి, సత్రశాల కమిటీ ఛైర్మన్ బ్రహ్మారెడ్డి పలువురు నేతలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గడప గడపకు

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్: జలాలపురం గామంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ప్రతి ఇంటికి వెళ్లిన ఎమ్మెల్యే శంకరరావు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ లబ్ది, సంక్షేమ ఫలాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. జలాలపురం గ్రామంలో జరిగిన అభివృద్ధి, శాశ్వత వనరుల కల్పన, నిధుల వినియోగం వివరాలు ప్రజలకు తెలియజేశారు. మండల ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, క్రోసూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ ఈద సాంబిరెడ్డి, వైసీపీ కన్వీనర్ మస్తాన్ షరీఫ్, సర్పంచి పూర్ణారెడ్డి కంకణాల శివాజీ, మాగులు అనిల్ కుమార్ పాల్గొన్నారు.

వార్షికోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-వినుకొండ: స్థానిక నిమ్మల బావి బజారులోని శ్రీ పట్టాభి రామస్వామి దేవాలయంలో 13వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీరామ నవమి జరిగి 16వ రోజు అయిన నేడు స్వామి వారి కళ్యాణం జరిపించి భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు పూజారి బాల, ఉపాధ్యక్షులు బేతంచర్ల పెద్ద నరసింహారావు, సెక్రటరీ జి వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ కొల్లి వెంకట కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు బీవీ నరసింహారావు, పూజారి శ్రీనివాసరావు, ఇమ్మడి నారాయణ, పోసా నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ పండుగ

విశాలాంధ్ర-వినుకొండ: స్థానిక రైల్వే స్టేషన్ రోడ్ లోని ఎఫ్రా ఇన్ ప్రార్ధన మందిరము నందు ఈస్టర్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాస్టర్ కే నాగభూషణ రావు మాట్లాడుతూ గుడ్ ఫ్రైడే అనంతరం ఏసుక్రీస్తు సమాధి కాపాడిన మూడవ రోజున మానవుల కొరకు పునరుజీవుడై వచ్చారని ఈ దినమునే సమస్త మానవాళి ఈస్టర్ వేడుకలు నిర్వహిస్తారన్నారు. పాస్టర్ జె ఎలీషా బాబు, జి బ్రహ్మానందం, సిహెచ్ కృపాకర్ రావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రెంటచింతల: సర్వమానవాళిని పాపాలనుండి రక్షించేందుకు ఏసు ప్రభువు ఆదివారం పునరుద్దానం పొందాడని గుంటూరు జిల్లా అర్సియం పీఠాధిపతి భాగ్యయ్య అన్నారు. ఆదివారం ఉదయం స్థానిక కానుకమాత చర్చి ప్రాంగణంలో జరిగిన ఈస్టర్ ప్రత్యేక దివ్యపూజాబలిలో పాల్గొన్నారు. అర్ధరాత్రి జరిగిన పూజలో ఫాదర్లు వైఎల్ మర్రెడ్డి, ఆంతోనిస్వామి, స్లీవారెడ్డి పాల్గొన్నారు. పునరుద్దాన సూచకగా పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. లూథరన్ సోదరులు తెల్లవారు జామున - సమాచాల ఉత్సవాలు, ఉదయం చర్చిలో ఈస్టర్ ప్రార్థనలు చేశారు. మండలంలోని అన్ని గ్రామాలలోనూ ఈస్టర్ వేడుకలు ఉత్సాహంగా క్రిస్టియన్ సోదరులు చేపట్టారు. క్రిస్టియన్ సోదరుల గృహాలను, వ్యాపార సంస్థలను పలువురు ఫాదర్లు సందర్శించి తీర్థం జలంలో శుద్ధిచేశారు.

అమరావతి మేజర్‌కి నీటిని విడుదల చేయాలి

విశాలాంధ్ర-పెదకూరపాడు: పెదకూరపాడు మండలంలోని కొన్ని గ్రామాల్లో కాలువల్లో నీరు రాక మిరప పంట ఎండిపోయే పరిస్థితి నెలకొంది. కొంచం రేటు ఉండడం వలన రైతులు ఎక్కువ పెట్టుబడి పెట్టడం మూలంగా ఈ సంవత్సరం పైరు ఇప్పుడు కూడా పచ్చి కాయలతో ఏపుగా వుంది. ఈ సమయంలో కాలువలకు నీరు ఆపడం వలన పైరు ఎండిపోయి మిరప రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. కావున అధికారులు స్పందించి వెంటనే నీటిని విడుదల చేయాలని, లేనియెడల మా నాయకులు మాజీ శాసనసభ్యులు కొమ్మాలపాటి శ్రీధర్‌తో చర్చించి రైతుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు హెచ్చరించారు.

ప్రచార కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



విశాలాంధ్ర-మేడికొండూరు : పేరేచర్లలో ఆదివారం ఎస్ఎం భాషా అధ్యక్షతన ప్రధాని మోదీ, అమీషా, అదాని, అంబానీ కార్పొరేట్ శక్తులకు, ప్రభుత్వ సంస్థలను ఎలా దోచిపెట్టేది, మతతత్వమును ఎలా రెచ్చగొట్టేది, భారత రాజ్యాంగాన్ని ఎలా నిర్వీర్యం చేస్తున్నది... క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించుతూ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు మండలంలోని ప్రతి గ్రామంలో ప్రచారం చేయాలని మండల సీపీఐ, సీపీఎం కమిటీ నిర్ణయించారు. సీపీఎం గుంటూరు జిల్లా కమిటీ సభ్యుడు బైరగాని శ్రీనివాసరావు, సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ళ శివశంకర్రావు, మేడికొండూరు మండల సీపీఎం కార్యదర్శి బొట్ల రామకృష్ణ, సుధాకర్ రెడ్డి, ఎస్‌కే మీరస తదితరులు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనకు జీవితాంతం పోరాడిన యోధుడు సీఆర్

%ఎఅని అవషం 04

విశాలాంధ్ర-వినుకొండ: భారతదేశంలో కులమత పీడనలు, వర్గ దోపిడీ లేని సమ సమాజ స్థాపన కోసం జీవితాంతం పోరాడిన యోధుడు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు అని పల్నాడు జిల్లా సీపీఐ కార్యదర్శి మారుతీవరప్రసాద్ కొనియాడారు. సీపీఐ అగ్ర నాయకులు భూ పోరాట యోధులు అమరజీవి సీఆర్ 29వ వర్ధంతి సందర్భంగా వినుకొండలోని శివయ్య భవన్లో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మారుతి మాట్లాడుతూ ప్రముఖ స్వాతంత్ర సమర యోధుడు ఎర్రజెండా ముద్దుబిడ్డ కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు భారత కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరని, తెలంగాణ సాయుధ పోరాటంలో అగ్ర భాగాన నిలబడి అచటి పేద ప్రజలు, రైతాంగానికి అండగా నిలబడి నిజాం నిరంకుశ పాలనను సాయుధ పోరాటంతో అంతమొందించే పోరాట పంథాలో పాల్గొని 10 లక్షల ఎకరాల భూములను నిరుపేద రైతాంగానికి పంచిన చరిత్ర కలిగిన యోధుడు సీఆర్ అన్నారు. స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో అనేక రాష్ట్రాలలో భూమికోసం భుక్తి కోసం బడుగు జీవుల విముక్తి కోసం పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతర శ్రామికుడిలా కమ్యూనిస్టు పార్టీ అగ్ర నేతగా పోరాటాలు సలిపారన్నారు. భారత కమ్యూనిస్టు ఉద్యమానికి ప్రధాన

జిల్లా సీపీఐ కార్యదర్శి మారుతి

కార్యదర్శిగా 28 సంవత్సరాలు చేసి 1992లో అలసి పోయి తనంతట తానుగా విశ్రమించి 1994 ఏప్రిల్ 9వ తేదీన అమరులయ్యారని అటువంటి అమరవీరుని ఆశ యాల సాధన కోసం, దేశంలో పేద ప్రజల బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం వామపక్ష శ్రేణులు, పేద ప్రజలు కార్మికులు కష్టజీవులు పాటుపడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ వినుకొండ నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, సీపీఐ పట్టణ కార్యదర్శి రైతు సంఘం నాయకులు ఉలవలపూడి రాము, సీపీఐ నాయకులు బి సాగర్, వెంకటేశ్వర్లు, ఎ. పవన్ కుమార్, పేరు పోగు మార్కు, మల్లికార్జునరావు, కుంచాల అఖిల్, పి. శశి కుమార్, షేక్ షరీఫ్, షేక్ గఫార్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమష్టి ఉద్యమాలు చేద్దాం

విశాలాంధ్ర-సత్తెనపల్లి : నియోజవర్గ సమస్యలపై సమిష్టి ఉద్యమాలు చేద్దామని మాజీ శాసనసభ్యులు, తెలుగు దేశం పార్టీ నాయకులు వైవీ ఆంజనేయులు సూచించారు. ఆదివారం సీపీఐ కార్యాలయానికి విచ్చేసిన వైవీ సీపీఐ అనుబంధ సంఘాల నాయకులతో ఆత్మీయ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. రాజకీయాలు అతీతంగా నియోజకవర్గ సమస్యలపై ఈ నెల 14 నుంచి వామపక్షాలు చేపడుతున్న పాదయాత్రకు సంఘీభావం తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సామాజిక సమస్యగా గంజాయి, కల్తీ మద్యం తదితర రుగ్మతలపై ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలను సమిష్టిగా చేద్దామన్నారు. నియోజవర్గంలో ప్రధాన సమస్యలైనా బలిజేపల్లి చెక్ డ్యాం, పట్టణంలోని అచ్చంపేట రోడ్‌లోని రైల్వే గేటుపై ఫ్లై ఓవర్ నిర్మించాలని, నియోజకవర్గంలోని మారుమూల చివరి ఎకరాకు నీరొచ్చే విధంగా ఎత్తిపోతల పథకాల నిర్మాణ తదితర సమస్యలపై ప్రజా ఉద్యమాలను రూపొందిస్తే తాము భాగస్వాములవుతామన్నారు. రానున్న కాలంలో సీపీఐ చేసే ఉద్యమాలకు ప్రజా చైతన్య కార్యక్రమాలకు అండగా ఉంటానన్నారు. ఈ సందర్భంగా వైవీని సన్మానించారు. కార్యక్రమంలో సీపీఐ, తెలుగుదేశం పార్టీ అనుబంధ సంఘాల నాయకులు చౌతా శ్రీనివాసరావు, రామమోహనరావు, పోట్ల రామాంజనేయులు, జింకా శ్రీనివాస్, పచ్చల నాగేశ్వరరావు, నరిశేటి వేణుగోపాల్, యిర్మీయా, కంబాల శ్రీనివాస్, నరసింహారావు, సుభాని, రహమాన్, మస్తాన్, కంబాల ఆనంద్ తదితరాలు పాల్గొన్నారు.

అందరూ కలిసి మెలసి ఉండాలి: సీఐ

విశాలాంధ్ర-రొంపిచర్ల : గ్రామస్థులందరూ వివాదాలకు దూరం ఉంటూ కలసి మెలసి జీవించాలని నరసరావుపేట రూరల్ సిఐ వై.భక్తవత్సల్ రెడ్డి కోరారు. మండలంలో రామిరెడ్డిపాలెం గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పల్లెనిద్ర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భక్తవత్సల్ రెడ్డి గ్రామంలో పర్యటించి గ్రామస్తులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో నెలకున్న డ్రైనేజీ, అస్తవ్యస్తంగా ఉన్న సైడ్ కాలువలు తదితర సమస్యలను స్థానికులు భక్తవత్సల్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో గల మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో బస చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సురేష్, పోలీసు సిబ్బంది, గ్రామపెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రశాంత జీవనాన్ని గడపాలి

విశాలాంధ్ర-ఈపూరు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ప్రశాంత జీవనాన్ని గడపాలని డీఎస్పీ సిహెచ్.విజయభాస్కరావు అన్నారు. మండలంలోని ఇనిమెళ్ళ గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి గ్రామాన్ని సందర్శించి గ్రామంలోని ప్రధాన కూడలిలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అనంతరం గ్రామస్తులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్షణికావేశానికి గురై ఘర్షణలకు వెళ్లకుండా, ప్రశాంతంగా ఆలోచించి సమస్యలను పరిష్కరించుకోవాలని, సమస్య ఉంటే పోలీసుల దృష్టికి తీసుకెళ్లి సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. భూతగాదాలు, వ్యక్తిగత విషయాలు, ఇంటి దగ్గర చిన్న, చిన్న సమస్యలను పెద్దవిగా కాకుండా, పెద్దల సమక్షంలో, లేకపోతే పోలీసుల ఆధ్వర్యంలో పరిష్కరించుకోవాలన్నారు. పిల్లలను చదివించి అక్షరాసులుగా తీర్చిదిద్దినప్పుడే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయని, చదువుతో అన్ని సమస్యలను అధిగమించవచ్చన్నారు. గ్రామాల్లో అల్లర్లు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసు సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వినుకొండ రూరల్ సిఐ రమేష్ బాబు, ఎస్ఐ విప్పర్ల వెంకట్రావు, పోలీస్ సిబ్బంది, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్ఎస్పీ స్థలంలో నిర్మాణాలు జరగాలి: జీవీ

విశాలాంధ్ర-వినుకొండ: భావితరాలను దృష్టిలో ఉంచుకొని ఎన్ఎస్పి స్థలంలో అభివృద్ధి కార్యక్రమాలకు నాడు తీసుకువచ్చిన 146 జీవో ప్రకారం నిర్మాణాలు జరగాలని, ప్రస్తుతం నిర్మించబోతున్న మల్టీప్లెక్స్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలకు టిడిపి వ్యతిరేకిస్తుందని దీనిపై టిడిపి ఆధ్వర్యంలో సోమవారం వినుకొండ మునిసిపల్ కార్యాలయం వద్ద నిరసన చేపడ్తామని జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టిడిపి హయాంలో ఎన్ఎస్పి స్థలం 21.22 ఎకరాలు పట్టణ అభివృద్ధికి, ప్రజా ప్రయోజనాలకు మున్సిపాలిటీకి అప్పగించడం జరిగిందన్నారు. దానిలో షాదీ ఖానా, ఆడిటోరియం, పార్క్, స్టేడియం, టిటిడి కళ్యాణ మండపం, మార్కెట్, షాపింగ్ కాంప్లెక్స్, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి తీర్మానిస్తూ జీవో తీసుకురావడం జరిగిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు జీవోకు భిన్నంగా వ్యవహరిస్తూ ప్రజా ప్రయోజనాలను పక్కనపెట్టి మల్టిపుల్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టి 14 లక్షలు వసూలు చేసేందుకు మున్సిపాలిటీ సిద్ధమైందన్నారు. ఇంజనీరింగ్ కళాశాల, తంగిరాల డ్యామ్ అంటూ చేసిన వాగ్దానాలు ఒకటి నెరవేర్చలేకపోయారని ఇటువంటి ఎమ్మెల్యేకి వచ్చే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షులు పెమ్మసాని నాగేశ్వరరావు, పి.వి సురేష్ బాబు,సౌదాగర్ జానీ భాష ,పత్తి పూర్ణచంద్రరావు, శమిమ్ ఖాన్,మీసాల మురళీకృష్ణ యాదవ్, పులి నాగరాజు ఫరీద్ పాల్గొన్నారు.

పోరాటయోధుడు సీఆర్

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్: పోరాటయోధుడు కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు అని పెదకూరపాడు నియోజకవర్గం సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని 75 తాళ్లూరు బస్టాండ్ సెంటర్లో సీపీఐ కార్యాలయం వద్ద ఆదివారం ఆయన 29వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా సిపిఐ సీనియర్ నేత చల్లపల్లి పానయ్య రాజేశ్వర చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ సీపీఐ ముద్దుబిడ్డ, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, స్వతంత్ర సమరయోధులు, తెలంగాణ సాయుధ పోరాటంలో ముందుండి నడిపించిన మహోన్నత వ్యక్తి తన యావదాస్తి పార్టీకి ధారబోసిన త్యాగశీలి పూర్వ జాతీయ కార్యదర్శిగా అనేక పదవులు చేపట్టి ఎర్రజెండాని ఊరు వాడల రెపరెపలాడించి అనేకమంది ఎర్రసైనికులను తయారు చేసిన మహా మేధావి చంద్ర రాజేశ్వరరావు జయంతి జరుపుకోవ దం అభినందనీయమని అన్నారు. నేటి యువత చంద్ర ఆశయాలను ఆదర్శంగా తీసుకొని గ్రామీణ ప్రాంతాలలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి దొడ్డ రాజు, సీనియర్ నాయకులు బెజ్జం వసంతరావు, పద్మారావు, వెంకట్రావు, శివారెడ్డి, షేక్ ఆదామ్, షఫీ, బాజీ, దేవ సహాయం, జొన్నపాల కోటేశ్వరరావు, ఆటో వర్కర్స్ నాయకులు షేక్ సుభాని, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిపై కేసు

విశాలాంధ్ర-మాచర్ల: అక్రమంగా తెలంగాణ మద్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు సెబ్ ఎస్సై మురళి కృష్ణ ఆదివారం తెలిపారు. ఎస్సై మురళీకృష్ణ మాట్లాడుతూ మాచర్ల మండలం పశువేముల గ్రామానికి చెందిన మాదం చెన్నకేశవులు కొంతకాలంగా తెలంగాణ మద్యాన్ని అక్రమంగా తీసుకువచ్చి మండలంలోని పలు గ్రామాలలో అమ్మకం జరుపుతున్నట్టు సమాచారం ఉందన్నారు. దీంతో చెన్నకేశవులపై నిఘాబెట్టి ఉంచామని, ఈ క్రమంలోనే ఆదివారం పొందుగుల నుంచి మద్యాన్ని మాచర్లకు బుల్లెట్ వాహనంపై తీసుకు వస్తున్నట్లు సమాచారం రావడంతో రింగ్ రోడ్డు సెంటర్లోని బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ ముందు కాపు వేసి చెన్నకేశవలను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. నిందితుని వద్ద ఒక కేసు తెలంగాణ మద్యం ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ మేరకు నిందితుడుపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపినట్లు ఆయన పేర్కొన్నారు.

అయోధ్య స్వామి ఆశ్రమంలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : మండల పరిధిలోని 75 తాళ్లూరు గ్రామంలో అవధూత అయోధ్య స్వామి ఆశ్రమంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు మంగళ వాయిద్యాలు నడుమున అయోధ్య స్వామి విగ్రహానికి భక్తులచే పంచామృత అభిషేకాలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజతో ప్రారంభించి హోమాలు, రుద్రాభిషేకాలతో పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులచే ఓం సాయి నాథ జై అయోధ్య స్వామీజీ అంటూ భజన పలి నిర్వహించి శిరిడి సాయినాథ గురు చరిత్ర పారాయణం నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం కమిటీ సభ్యులు తాటి కోటేశ్వరమ్మ, రామకృష్ణ, స్వతంత్ర భారతి, సుబ్బారావు, వెంకయ్య, సీతారామ లక్ష్మీదేవి, సాయి తదితరులు పాల్గొన్నారు.

రహీంను పరామర్శించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : మండల పరిధిలోని పాటిబండ్ల గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సయ్యద్ జానీ కుమారుడు రహీం ఇటీవల ప్రమాదానికి గురై గుంటూరులోని లలిత మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో చికిత్స పొందుతుండగా పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు ఆదివారం పరామర్శించారు. రహీంకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆశీర్వాదం జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : అచ్చంపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నందిగామ ఆశీర్వాదం జన్మదిన వేడుకలు ఆదివారం మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం కొమ్మాలపాటి శ్రీధర్ కేక్ కట్ చేసి మాట్లాడుతూ ఆశీర్వాదం 1983 నుంచి తెలుగుదేశం పార్టీలో కొనసాగుతూ అన్ని వర్గాల ప్రజలకు తోడుగా ఉంటూ పార్టీ అభివృద్ధికి చేసిన కృషి మరువలేనిదని అన్నారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో నరసరావుపేట పార్లమెంటు ఎస్సీ సెల్ కార్యదర్శి పాటిబండ్ల బాల్యయ్య, మొక్కపాటి గిరిబాబు, నల్లమేకల వెంకటేశ్వరరావు, అతిమళ్ళ రమేష్, మల్లాది విష్ణు, కొమ్మాలపాటి సాయి, సుధాకర్, కాసులు దెబ్బయ్య, గంధం కోటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

అన్నప్రసాద వితరణ



విశాలాంధ్ర-వినుకొండ: వినుకొండ లాయర్ స్ట్రీట్ లోని శ్రీ సీతారామ ఆంజనేయ స్వామి వారి శ్రీరామనవమి పురస్కరించుకుని 16 రోజుల పండగలో భాగంగా ఆదివారం ఆలయ ఆవరణలో 2000 మందికి అన్న ప్రసాద వితరణ జరిగినది. ఈ కార్యక్రమానికి వైసీపీ వార్డు కౌన్సిలర్ రెడ్డి నగేష్ దంపతులు, బిజెపి వినుకొండ కన్వీనర్ యార్లగడ్డ లేని కుమార్, అప్పారావు రామయోగి మాస్టర్ నరసయ్య కోటేశ్వరరావు ప్రసాదు నరేంద్ర రవి కళ్యాణ్ సతీష్ జగదీష్ మరియు కమిటీ సభ్యులు వీరు చేసిన సేవలకు పలువురు అభినందనలు తెలిపారు.

చంద్ర ఆశయాలు కొనసాగిస్తాం: కాసా

విశాలాంధ్ర-నరసరావు పేట: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, త్యాగ శీలి కామ్రేడ్ స్వర్గీయ చంద్ర రాజేశ్వరరావు ఆశయాలను కొనసాగిస్తామని పల్నాడు జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి కాసా రాంబాబు అన్నారు. పట్టణంలోని జిల్లా కార్యాలయంలో కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు 29వ వర్ధంతి కార్యక్రమాన్ని సీపీఐ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాసా రాంబాబు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ముద్దుబిడ్డ, పోరాటయోధుడు, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు పోరాటాలు చేసిన నాయకుడు, యావదాస్తిని ప్రజలకు దారా దత్తం చేసిన త్యాగశీలి, భారత కమ్యూనిస్టు పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ రాజేశ్వరరావు ఆశయాలను కొనసాగిస్తామని అన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పలపాటి రంగయ్య, పట్టణ కార్యదర్శి వైదన వెంకట్, గురవారెడ్డి, ముస్తఫాలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్యక్రమాల పరిశీలన

విశాలాంధ్ర-నరసరావుపేట: జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఒకపక్క నువ్వే మా నమ్మకం జగనన్న కార్యక్రమాన్ని ముమ్మరంగా నిర్వహిస్తూ మరోపక్క ఉదయాన్నే పట్టణంలోని వార్డుల్లో పారిశుధ్య కార్యక్రమాలను మోటార్ బైక్ పై స్వయంగా పరిశీలిస్తూ ప్రజలతో మమేకమవుతున్నారు. ఆదివారం ఉదయం ఎమ్మెల్యే గోపిరెడ్డి మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలిసి మోటార్ బైక్‌పై పట్టణంలోని వార్డుల్లో పర్యటించి పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. 20వ వార్డు రామిరెడ్డి పేట లోని కొన్ని ప్రాంతాల్లో పేరుకుపోయిన పారిశుద్ధ్యం తొలగించాలని, రోడ్లపై అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వార్డులో ప్రజలను పేరుపేరునా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మరోవైపు మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పథకాలను వివరిస్తూ వార్డు ప్రజలతో గడిపారు. ఎమ్మెల్యే స్వయంగా బైక్‌పై తమ ఇళ్ల వద్దకు వస్తుండడంతో వార్డు ప్రజల్లో హర్షం, ఆనందం వ్యక్తం అయింది.

రైతు భరోసాకు దరఖాస్తుల స్వీకరణ

విశాలాంధ్ర-శావల్యాపురం : నూతనంగా రైతు భరోసా పొందదానికి రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఏఓ రామినేని రామారావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నూతనంగా పొలాలు కొనుగోలు చేసిన రైతులు, ఐటి, జీఎస్టీ వంటి గ్రీవెన్స్‌లో ఉన్న రైతులు దరఖాస్తులు చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతులు జారీ చేసిందని, ఈ నెల 30వ తేది వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని చెప్పారు. అర్హులైన రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకోవాలనుకునే రైతులు ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు పుస్తకం జిరాక్స్‌తో సమీపంలోని రైతుభరోసా కేంద్రాల్లోని వీఏఏలను సంప్రదించాలని తెలిపారు.

చంద్ర రాజేశ్వరరావు వర్ధంతి

విశాలాంధ్ర-సత్తెనపల్లి : భారత కమ్యూనిస్ట్ పార్టీ నాయకులు, ఆదర్శ కమ్యూనిస్ట్ కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఆదివారం సత్తెనపల్లి సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ శాసనసభ్యులు వైవీ ఆంజనేయులు చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పేద ప్రజల అభున్నతి కోసం చంద్ర చేసిన సేవలను గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ అనుబంధ సంఘాల నాయకులు నరిశేటి వేణుగోపాల్, యిర్మీయా, కంబాల శ్రీనివాస్, షేక్ సుభాని, రహమాన్, నరసింహారావు, కంబాల ఆనంద్, దారా మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాలపాటి అరెస్ట్

విశాలాంధ్ర-అమరావతి : ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమ ఇసుక తరలిస్తూ మైనింగ్ దోపిడి చేస్తూ వేల కోట్ల మైనింగ్ అవినీతిలో కూరుకుపోయి అభివృద్ధి చేయని పాలక ప్రభుత్వంపై యావత్ ప్రజానీకం దుమ్మెత్తిపోస్తున్న నిమ్మకునీరెత్తుతూ దోచుకోవడం దాచుకోవడం అనే సాంప్రదాయతో సిగ్గులేని పాలన సాగిస్తున్న ప్రభుత్వ విధానాన్ని ఎండగట్టేందుకు సవాల్ ప్రతి సవాల్‌పై ఆదివారం అమరలింగేశ్వర స్వామి సాక్షిగా అవినీతిపై సాక్షాధారాలతో ప్రమాణ కార్యక్రమాన్ని చేయటానికి వస్తున్న మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ తన అనుచరులను దేవాలయానికి అర కిలోమీటర్ దూరంలో పోలీసులు అరెస్టు చేయటాన్ని యావత్ ప్రజలు ముక్తాకంఠంతో ఖండించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ నాలుగు సంవత్సరాల వైసీపీ పాలనలో ఒక్క అభివృద్ధి చేశారని నిరూపిస్తే నేను స్వాగతిస్తానని చెప్పారు. దమ్ము ధైర్యం ఉంటే వాస్తవాలకు అవకాశం కల్పించాలన్నారు. కృష్ణా నదిలో ఇసుక మైనింగ్ తవ్వకాలలో పూర్తిస్థాయిలో అవినీతిలో కూరుకుపోయిన నంబూరు శంకరరావు చర్చకు రమ్మని అక్రమ అరెస్టులు చేయించటం సిగ్గుచేటన్నారు. పాలనలో అవినీతిలో కూరుకుపోయి ప్రజలపై పెను బారాలు మోపుతూ వారి జీవితాలపై విలయతాండవం చేస్తున్న పాలకవర్గాన్ని కాలగర్భంలో కలిపేందుకు యావత్తు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఆదివారం అమరావతి విచ్చేసిన మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌తో పాటు వివిధ ప్రాంతాల నాయకులను అక్రమ అరెస్టులు చేసి క్రోసూరుకి తరలించటం సిగ్గు చేటదన్నారు. ఇప్పటికైనా దమ్ము ధైర్యం ఉంటే నియోజవర్గ అభివృద్ధిపై అవినీతిపై చర్చకు సిద్ధమేనని అన్నారు. ఈ సందర్భంగా అమరావతిలో 144 సెక్షన్ విధించి రెండు వందల పైచిలుకు పోలీసు వర్గాలు శాంతి భద్రతల దృష్ట్యా అమరావతి ప్రధాన కూడల్లో పెద్ద సంఖ్యలో బందోబస్తు నిర్వహించారు. కొమ్మాలపాటి శ్రీధర్‌ను అరెస్టు చేసి క్రోసూరు తరలించిన అనంతరం స్థానిక శాసనసభ్యులు నంబూరు శంకరరావు అమరావతి గెస్ట్ హౌస్ నుంచి గుంటూరు వెళ్లారు.

టీడీపీ పాలనలోనే ఉచిత ఇసుక పేరుతో వందల కోట్లు దోచుకున్నారు: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-అమరావతి : తనపై అవినీతి ఆరోపణలు చేసిన వాళ్లు అమరావతిలో బహిరంగ చర్చకు రావాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సవాల్ విసిరిన విషయం తెలిసిందే. చెప్పినట్టుగానే ఆదివారం ఉదయం అమరావతి అమరలింగేశ్వర స్వామి ఆలయానికి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు వచ్చారు. మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అవినీతి చిట్టా తీసుకువచ్చానని.. దమ్ముంటే చర్చకు రావాలని పిలుపునిచ్చారు. కొమ్మాలపాటికి దమ్ముంటే చర్చకు ఒక్కరే రావాలని.. తాను కూడా కార్యకర్తలను పంపించివేస్తానని స్పష్టం చేశారు. ఒక దశలో కార్యకర్తలు ఆందోళన చెందకుండా సంయమనం పాటించాలని కోరారు. టీడీపీ పాలనలో ఉచిత ఇసుక పేరుతో వందల కోట్లు దోచుకున్నారని.. ఆ కోట్లన్నీ కొమ్మాలపాటి ఖాతాలోకి వెళ్లాయన్నారు. సదావర్తి భూముల స్కామ్ కూడా టీడీపీ పాలనలోనే జరిగిందని గుర్తుచేశారు. పేకాట క్లబ్‌లు, క్రికెట్ బెట్టింగులు వంటి మాఫియా కార్యకలాపాల కొమ్మాలపాటి హయాంలోనే జరిగాయని.. తన వద్ద అన్ని ఆధారాలున్నాయని స్పష్టం చేశారు. ఇసుకకు తనకు ఎలాంటి సంబంధం లేదని.. ఇసుక ద్వారా సొమ్ము నేరుగా ప్రభుత్వానికి వెళ్తోందని.. దాంట్లో తాను అవినీతి ఎలా చేస్తానని ప్రశ్నించారు. సంక్షేమ పథకాల రూపంలో పెదకూరపాడు నియోజకవర్గంలో రూ.1370 కోట్లు పేదల ఖాతాల్లో జమ చేశామన్నారు. రూ.650 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేశామన్నారు. ఎప్పుడో కన్నా లక్ష్మీనారాయణ హయాంలో అనుమతి వచ్చినా.. కనీసం పాలిటెక్నిక్ కాలేజ్ కట్టలేకపోయారని విమర్శిం చారు. తాను ఏడాదిలోనే కాలేజీ నిర్మించానని.. మాదిపాడు వద్ద కృష్ణానది వద్ద బ్రిడ్జి పనులు కూడా త్వరలోనే ప్రారంభమవుతాయని చెప్పారు. ఆర్భాటంగా రాజధాని ప్రకటించారని.. కానీ కనీసం అమరావతి నుంచి తుళ్లూరు ప్రాంతానికి రోడ్డు కూడా వేయలేకపోయారని విమర్శించారు. తాను పెదమద్దూరు వద్ద బ్రిడ్జితో పాటు అమరావతి-తుళ్లూరు రోడ్డు వేయిస్తున్నానని చెప్పారు. వైసీపీ వారు రౌడీయిజం చేస్తున్నారంటున్న కొమ్మాలపాటికి ఆధారాలతో సమాధానం ఇచ్చారు. టీడీపీ హయాంలో 75 రౌడీషీట్లు తెరిస్తే.. తమ హయాంలో కేవలం 21 రౌడీషీట్లు వేశామన్నారు. టీడీపీ హయాంలో 31 హత్యలు జరిగాయని లెక్కలతో సహా చూపించారు. పోలీసుల పహారీలో సవాల్‌కు స్వస్తిపలికారు.

JAVERA B.Ed COLLEGE

GANAPAVARAM, CHILAKALURIPET (Town), GUNTUR DIST 522619

ADMSSION NOTIFICATION UNDER CATEGORY A & B SEATS

Applications are invited for admission into **B.Ed Course** 2022-2023 under Spot & Management Quota. The availability of seats is as follows.

Subject	Spot Admission	Management Quota
MATHEMATICS	22	6
PHYSICAL SCIENCE	9	2
BIOLOGICAL SCIENCE	17	5
SOCIAL STUDIES	29	9
ENGLISH	8	3

Apply on or before 10.11.2016 and attend the college on 10.04.2023 with all original Certificates for Admission.

SRIHARSHA THOTAKURA
SECRETARY & CORRESPONDENT
Contact No. 8341586274

యువగళం పాదయాత్రలో ఎమ్మెల్యే

విశాలాంధ్ర - యద్దనపూడి : బాపట్ల పార్లమెంట్ సభ్యులు పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు యువగళం పాదయాత్రలో యువనేత నారా లోకేష్‌తో కలసి పాదయాత్రలో పాల్గొని సంఘీభావం తెలిపారు. యువగళంలో పాల్గొన్న కార్యకర్తల్లో ఏలూరి ఉత్సాహం నింపారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా టిడిపి నేతలు దామచర్ల జనార్ధన్, కొండేపి ఎమ్మెల్యే డోలా వీరాంజనేయులు, దామచర్ల సత్య, ఇంకొల్లు మండలం టిడిపి నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధికి రూ.64 లక్షలు మంజూరు

విశాలాంధ్ర - మార్టూరు : కూరగాయల మార్కెట్ అభివృద్ధికి రూ. 64 లక్షలు నిధులు మంజూరైనట్లు మార్కెటింగ్ కో-ఆపరేటివ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆయన తాడేపల్లి నుండి ఒంగోలు వెళుతూ మార్టూరులో విలేకరుల సమావేశం నిర్వహించారు. రైతుల పడుతున్న ఇబ్బందులను చూసి సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు కోసం రూ. 22.22 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఈ నెల 12వ తేదీలోపు టెండర్ దాఖలుకు ఆన్లైన్ దరఖాస్తు నోటీసులు జారీ చేయాలని అధికారులకు సూచించారు. మార్కెట్ దక్షిణం వైపున నూతన గోడౌన్ ప్రాంగణంలో గేటు నిర్మాణం ఇతర అభివృద్ధి పనులలతోపాటు 212 మంది హమాలీలకు లైసెన్సుల కొరకు రూ. 42 లక్షలు నిధులు మంజూరైనట్లు బత్తుల తెలిపారు. రైతులు కూరగాయల మార్కెట్ లోని వ్యాపారులు హమాలీల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు.

అగ్ని ప్రమాదాలు జరగకుండ జాగ్రత్తగా వహించాలి

విశాలాంధ్ర - కర్లపాలెం : వేసవిలో అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కర్లపాలెం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కర్లపాలెం చైర్మన్ ఇనకొల్లు పోలీసు రావు చెప్పారు. శనివారం దుండివారిపాలెం అక్కి రాజు దిబ్బకాలనీలో ప్రమాదవశాత్తు గృహం కాలిపోయిన అద్దూరి రమణమ్మకి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తరుపున వంటపాత్రల కిట్ అందజేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ బిఎస్ నారాయణ బట్టు గారి ఆదేశాల మేరకు నిర్వ్యాహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు ఓబధ్య తదితరులు ఉన్నారు.

నేడు శంకరన్ స్మారకోపన్యాసం

విశాలాంధ్ర - బాపట్ల : నిరుపేదల కలెక్టర్‌గా ఖ్యాతినొందిన ఎస్.ఆర్ శంకరన్ స్మారకోపన్యాసం సోమవారం సాయంత్రం 4 గంటలకు ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో టౌన్ హాల్లో జరుగుతుందని ఫోరం కార్యదర్శి పీసీ సాయిబాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రఖ్యాత మానవ హక్కుల నాయకులు ఆచార్య జి హరగోపాల్, ఏపీ మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ డి.చక్రపాణి పాల్గొంటారని తెలిపారు. శంకరన్ సివిల్ సర్వీస్ వ్యవస్థను మానవీయం చేసి ప్రభుత్వ పాలనా వ్యవస్థను ప్రజల వద్దకు పరుగులు పెట్టించారన్నారు. నిరాడంబరంగా సామాన్య మానవుని వలె జీవించిన శంకరన్ జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. నేటి తరానికి శంకరన్‌ను పరిచయం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని అందరూ పాల్గొని విజయవంతం చేయాలని సాయిబాబు కోరారు.

ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పట్టణంలోని సరోజినీదేవి కాలనీ నందు తాపి కార్మికుడు అయ్యప్పకు ప్రమాదవశాత్తు కాలువిరగడంతో తీవ్ర ఇబ్బందిని ఎదుర్కొంటున్న విషయం గమనించిన ఫ్రెండ్స్ అర్గనైజేషన్ సభ్యులు ఆర్థిక సహాయం అంద జేశారు. సంస్థ గౌరవ అధ్యక్షులు వేజండ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ నిరుపేదలు ఎవరైనా ఆపదలో ఉంటే మా ఫ్రెండ్స్ అందరు కలిసి సహాయంను అందజేయడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గోపి, జోగి సువర్ణ రాజు, సుబ్బారావు పాల్గొన్నారు.

డిగ్రీ మూల్యాంకన చార్జీలు పెంచండి

విశాలాంధ్ర - చీరాల : ఎస్ఎస్ఎస్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పరీక్ష పత్రాల మూల్యాంకనం చార్జీలను పెంచాలని అధ్యాపకులు ప్రిన్సిపల్ జి.ఆదిలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. డిగ్రీ పరీక్షల ఫలితాలు వెల్లడించే ముందు పరీక్ష పత్రాలను పరిశీలించే అధ్యాపకుల చార్జీలు రూ.18 నుండి 30కి పెంచాలని అధ్యాపకులు డిమాండ్ చేస్తూ ప్రిన్సిపల్ జి ఆదిలక్ష్మికి వినతి పత్రాన్ని అందించి తగు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంపై అధ్యాపకులు ప్రస్తుతం పెరిగిన చార్జీలను దృష్టిలో ఉంచుకుని మా డిమాండ్ ను ఆమోదించాల్సిందిగా ప్రిన్సిపల్ కు తెలియజేసారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో అధ్యాపక, అధ్యాప కేతర సిబ్బంది పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రకు సంఘీభావం

విశాలాంధ్ర-ఒంగోలు : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ గారి చేపట్టిన యువగళం పాదయాత్రలో ఆదివారం అనంతపురం జిల్లా గనమాల నియోజకవర్గంలో సంఘీభావంగా పాల్గొన్నారు. ఒంగోలు మాజీ శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ దామచర్ల జనార్ధన్ రావు, టీడీపీ శాసన సభ్యులు, ఉమ్మడి ప్రకాశం జిల్లా టిడిపి ఇంచార్జిలు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో దేశం అధోగతి

సీపీఐ జిల్లా నాయకులు జేబీ శ్రీధర్

14 నుంచి ప్రచారందోళన

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : బీజేపీ ప్రజా వ్యతిరేఖ విధానాలను నిరసిస్తూ ఈ నెల 14వ తేదీ నుంచి 30వ తేదీ వరకు సీపీఐ వామపక్షాల ఆద్వర్యంలో జరగనున్న ప్రచారందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా నాయకులు జేబీ శ్రీధర్ పిలుపునిచ్చారు. ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశం అధోగతి పాలైందన్నారు. అధికారం కోసం నల్లధనం వెలుగు తీసి ప్రతి కుటుంబానికి రూ.15 లక్షలు ఇస్తానని బూటకపు హామీలను ఇచ్చారన్నారు. యువతకు ప్రతి ఏడాది రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని విభజన హామీలు, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తానని హామీ ఇచ్చి గాలికి వదిలేశారన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారం, రామాయపట్నం పోర్టు అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసి అమ్ముకుంటున్న మోడీ, అమిత్ షాలను ఇంటికి పంపాలని ప్రచారాందోళన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. కేంద్రం ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని విషయాల్లో తీరని ద్రోహం చేసిందని అమరావతి రాజధాని ప్రత్యేక హోదా విభజన హామీలు ఇచ్చిన హామీలు అన్నీ నీటి మూటలుగా మిగిలాయన్నారు . ఇంత జరుగుతున్నా రాష్ట్రంలోని వైసిపి, టిడిపి, జనసేన మూడు ప్రాంతీయ పార్టీలు బిజెపిని ప్రశ్నించలేని స్థితిలో ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించడమే ధ్యేయంగా సిపిఐ, వామపక్షాల ఆధ్వర్యంలో ప్రచారాందోళన కార్యక్రమాలు చేపట్టినట్లు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని శ్రీధర్ పిలుపునిచ్చారు.

రోజురోజుకు పతనమవుతున్న మొక్కజొన్న ధర

విశాలాంధ్ర - జె.పంగులూరు : గత కొన్ని రోజులుగా ఆశాజనకంగా ఉన్న మొక్కజొన్న ధర, వారం రోజుల నుంచి తగ్గిపోతుంది. ప్రభుత్వం నిర్ణయించిన ధర కన్నా, ప్రైవేటు వ్యాపారుల ధర బాగుందని రైతులు ఆశ పడ్డారు. ఈ తరుణంలో ధరలు తగ్గిపోవటం రైతాంగాన్ని నిరాశకు గురిచేస్తుంది. మొదట్లో ఆశాజనకంగా ఉన్న మొక్కజొన్న ధర, రోజు రోజుకు పతనం అవ్వటం పట్ల వ్యాపారుల సిండికేట్ ప్రభావం ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ సంవత్సరం రబీలో మండలంలో 4,600 ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేశారు. ఎకరాకు 30 నుండి 40 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తున్నాయి. నెల రోజులు ముందు ప్రైవేటు వ్యాపారుల ధర కూడా బాగా ఉంది. ప్రభుత్వం ధర 1,960 రూపాయలు ఉండగా, ప్రైవేట్ వ్యాపారుల ధర 2,200 రూపాయల వరకు ఉంది. దీంతో మొక్కజొన్న రైతులు మంచి లాభాలు వస్తాయని ఆశించారు. గత 10 రోజులు నుండి మొక్కజొన్న పంట కోయటంతో, ధర తగ్గుతూ ప్రస్తుతం 1,960 రూపాయలకు చేరింది. రాబోయే రోజుల్లో ఇంకా ధర తగ్గే అవకాశం ఉందని పలువురు రైతులు చెబుతున్నారు. మొక్కజొన్న ఒక్కసారిగా రైతుల ఇళ్లకు చేరటం, రైతులు వ్యాపారుల చుట్టూ తిరగటం వలన వ్యాపారులు సిండికేట్ అయి ధరలు తగ్గించడం ప్రారంభించారని రైతులు చెబుతున్నారు. ఈ సంవత్సరం మొక్కజొన్న పంట ఆశాజనకంగా ఉందని, రైతులు వేలాది రూపాయలు పెట్టుబడులుగా పెట్టారు. కౌలు ధరలు కూడా ఎక్కువగా ఉన్నాయి. ధరలు తగ్గటం వల్ల నష్టాలు పాలవుతామని వాపోతున్నారు.

సన్నీ హత్య కేసులో 5గురు ముద్దాయిల అరెస్టు

వివరాలు వెల్లడించిన డీఎస్పీ శ్రీకాంత్

హత్యకు ఉపయోగించిన కొడవలి స్వాధీనం

విశాలాంధ్ర - బాపట్ల : చీరాల మండలం ఈపూరుపాలెం కుందేరు వాగు వద్ద జరిగిన సన్నీ హత్య కేసులో 5గురు ముద్దాయిలను అరెస్టు చేసినట్లు చీరాల డీఎస్పీ శ్రీకాంత్ తెలిపారు. చీరాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాటాడుతూ ఈపూరుపాలెంకు వీరయ్య నగర్‌కు చెందిన దొనేపూడి సురేంద్ర (సన్నీ) ముద్దాయిలు దేవరకొండ విజయ్, దేవరకొండ శ్రీకాంత్, దేవరకొండ శశాంక్,బొమ్మిడి శివ నాగ కృష్ణ, ఇట్టే వెంకటేష్‌లతో కలిసి అప్పుడప్పుడు మద్యం సేవించేవాడన్నారు. సన్నీ వారిని బెదిరించి అప్పుడప్పుడు డబ్బులు తీసుకునేవాడని ఒక సంవత్సరం క్రితం రాట్ వీలర్ కుక్కపోయిన విషయమై దేవరకొండ శశాంక్‌ను సన్నీ బంధించి ఇష్టం వచ్చినట్లు కొట్టినట్లు తెలిపారు. తరచూ సన్నీ వీరితో గొడవలు పడి డబ్బులు తీసుకుంటుండటంతో భరించలేని ముద్దాయిలు అప్పటి నుండి సన్నీపై కక్ష్య పెంచుకొని సన్నీని ఎలాగైనా చంపివేయాలని నిర్ణయించుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఇంటి దగ్గర రైల్వే ట్రాక్ ప్రక్కన మందు తాగే సమయంలో చంపేందుకు ప్రణాళిక వేసుకుని ఇంటి వద్ద ఉన్న కొడవలి రెండు కర్రలను తీసుకొని సన్నీని చంపేందుకు బైకుపై తిరుగుతుండగా గత నెల 29వ తేదీ రాత్రి సుమారు 07:30 గంటలకు రామాలయం దగ్గరకు వచ్చేసరికి సన్నీ ఫ్రెండ్ అమీన్ కనిపించగా, అమీన్‌తో సన్నీకి ఫోన్ చేయించి విజయ్ పుట్టిన రోజు పార్టీ ఇమ్మని అడిగావు కదా ఆ రోజు డబ్బులు లేవు ఈ రోజు మందు తాగుతూ, పాత కేసుల రాజీ గురించి మాట్లాడుకుందాం కుందేరు దగ్గర ఉన్న డ్రైయింగ్ యూనిట్ వద్దకు రమ్మని పిలిపించారు. దీంతో సన్నీ వారి చెప్పిన ప్రదేశానికి వెళ్ళగా ముద్దాయిలతో కలిసి కుందేరు వాగు దగ్గర చెత్త పోగు చేసే షెడ్ వెనుకకు వెళ్లి మద్యం సేవించిన తరువాత ముగ్గురు ముద్దాయిలతో పాటు నాలుగవ ముద్దాయి శివ కూడా కలసి, సన్నీపై దాడి చేసి, కొడవలి, సిమెంట్ రాయి, నాపరాయి బండ ముక్కను తీసుకొని సన్నీ తల మీద ఒంటి మీద, కాళ్ళ మీద ఇష్టం వచ్చినట్లు కొట్టారన్నారు. దీంతో సన్నీ తల పగిలి నోట్లో నుండి రక్తం కారి చనిపోయాడన్నారు. అనంతరం మరో ముద్దాయి వెంకటేష్ సన్నీ మృత దేహాన్ని రెండు దండెం కట్టే వైరు త్రాడు ఉండలును తీసుకొని కాలువలో నిలబెట్టి ఉన్న హద్దు రాయి స్తంభమును పెకిలించి సన్నీ మృతదేహానికి వెనుక హద్దు రాయి స్తంభమునకు వైరు తాడుతో కట్టి కుందేరులో ముంచేశారన్నారు. ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు చీరాల డిఎస్పి పి.శ్రీకాంత్ సూచనలతో చీరాల రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మల్లికార్జున సారథ్యంలో చీరాల రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ జనార్ధన్ తన సిబ్బందితో శని వారం ముద్దాయిలను అరెస్టు చేసి హత్యకు ఉపయోగించిన కొడవలి, బైకును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును చేధించడంలో విశేష ప్రతిభ కనపరిచిన చీరాల రూరల్ సిఐ, రూరల్ ఎస్సై, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస రావు, రమేశ్, వెంకయ్య, హేమచంద్ర, రామారావులను కానిస్టేబుల్ కృప, నాగంజనేయులులను ఎస్పీ అభినందించారు.

అభివృద్ధి చేతగాక స్టిక్కర్ పరిపాలన

ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

విశాలాంధ్ర-అద్దంకి : అభివృద్ధి చేయడం చేతకాక రంగులు, పేర్లు మార్చుకుంటూ స్టిక్కర్ పరిపాలన సాగిస్తున్న జగన్‌రెడ్డి నాలుగేళ్ళపాటు ప్రజల్ని వంచించి నేడు నమ్మకం, భవిష్యత్తు అంటూ బూటకపు మాటలు చెబుతున్నాడని అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఆదివారం పత్రికా ప్రకటన ద్వారా జగన్‌రెడ్డి పాలనపై దుయ్యబట్టారు. జగన్ అమలు చేస్తున్న సంక్షేమం అంతా అబద్దాలు, అంకెలగారడీకే పరిమితమని రాష్ట్రమంతా పాదయాత్ర చేసి అబద్దపు హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజల్ని వంచించిన జగన్‌రెడ్డి ఇప్పుడు జగన్ మాధైర్యం అంటూ కొత్త నాటకాలకు తెరతీశారన్నారు. రాష్ట్ర ప్రజలు జగన్‌ను ఎందుకు నమ్మాలి? రాష్ట్రాన్ని అప్పులుపాలు చేసినందుకా? నకిలీ మద్యం అమ్మకాలతో ఆడబిడ్డల తాళిబొట్లు తెంచుతున్నందుకా? ఉద్యోగాలు, ఉపాధి లేకుండా చేసి యువతను మాదకద్రవ్యాలు, గంజాయికి బానిసల్ని చేసినందుకా? బీసీలు, దళితులు, మైనారిటీల్ని హింసిస్తూ న్యాయంగా వారికి దక్కాల్సిన వాటిని లేకుండా చేసినందుకు నమ్మాలా అంటూ వైసీపీ ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే గొట్టిపాటి ప్రశ్నించారు. వాలంటీర్ వ్యవస్థతో గొడ్డుచాకిరీ చేయించుకుంటున్న జగన్ వారిని నమ్మకుండా వారు మాత్రం తననే నమ్మాలనడం విడ్డూరంగా ఉందన్నారు. ఉన్న పథకాలకే పేర్లు మార్చడం..కొత్తగా రంగులు వేయడం జగన్ నేర్చుకున్న రాజకీయమిదేనంటూ ఎద్దేవా చేశారు. ప్రజలంతా ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి చేస్తున్న మోసాలను గుర్తించి నిలదీయాలని, ప్రతి పథకంలో అర్హులైన వారికి పంగనామాలు పెట్టాడని, సంక్షేమ క్యాలెండర్ పేరుతో జగన్ విడుదల చేసిన సమాచారం మొత్తం పచ్చి అబద్దాలేనని ఎమ్మెల్యే రవికుమార్ పత్రికా ప్రకటన ద్వారా స్పష్టం చేశారు.

మరణం ముల్లును విరిచిన మృత్యుంజయుడు క్రీస్తు

- రెవరెండ్ కె.దీన్‌దయాల్

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ఏసుక్రీస్తు మానవాళి పాపముల కొరకై మరణించి మూడో దినమున తిరిగి లేవటమే ఈస్టర్ యొక్క ప్రత్యేక ప్రాధాన్యత అని రెవరెండ్ కె. దీన్‌దయాల్ భోదించారు. ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మృత్యుంజయ క్రీస్తు పాటలను ఆలపిస్తూ ఆరాధన నిర్వహించారు. చర్చిల్లో దైవసేవకులు క్రీస్తు పునర్దానమును గురించి ప్రత్యేక సందేశం చెప్పారు. ఈ సందర్భంగా దీన్‌యాల్ మాట్లాడుతూ తమ తమ ఆధ్యాత్మిక చింతన సరి చేసుకుంటూ మానవ జీవితంలోకి ఏసుక్రీస్తు యొక్క ప్రేమను పంచడమే నిదర్శనమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ ఎం.రాహుల్ దేవ్, జె. క్రిస్టఫర్, వెంకట్‌స్వామి, ప్రేమ్ చంద్ తదితరులు పాల్గొన్నారు.- ఫాదర్ హైయర్ లూథరన్ దేవస్థానం విద్యానగర్ రెండవ లైన్‌లోని ఈస్టర్ పండుగ సందర్భంగా ఫాదర్ చిన్నయ్య నేతృత్వంలో ప్రత్యేక ఆరాధన,చిన్న పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించి ఈస్టర్ సండే సందేశంను అందించారు. ఈ ఆరాధనలో చల్లపల్లి వెంకటేశ్వరరావు, జి.ప్రేమయ్య, మూపర్తి దేవగిరిరావు, దాసరి శేషగిరిరావు, సంఘ పెద్దలు ఎం. ప్రసాదరావు, సిహెచ్. వెంకటేశ్వరరావు డి.సునీబాబు, బి.మహేష్. స్త్రీల సమాజం, యూత్, సంఘస్తులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

విశాలాంధ్ర - రేపల్లె : రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని పట్టణ సీఐ విజయ చంద్ర సూచించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో యువత రోడ్డు ప్రమాదాలకు గురికావడం బాధాకరం అన్నారు. ప్రమాదాల భారిన పడకుండా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు చొరవ తీసుకోవాలని సూచించారు. యుక్త వయస్సులో ఉన్న తమ పిల్లలు ఎక్కడకు వెళ్లింది, ఎం చేస్తుంది గమనించాలన్నారు. ఇంటర్మీడియట్, పరీక్షలు ముగిసిన నేపథ్యంలో పిల్లలు వాహనాలను అతి వేగంగా నడప కూడదని తల్లి తండ్రులు తగు సలహాలు ఇవ్వాల న్నారు. రోజు రోజుకు పెరిగి పోతున్న రోడ్డు ప్రమాదాలు నివారిం చేందుకు పోలీసులతో పాటు ప్రజలు భాగ స్వాములు కావాలన్నారు. బైక్ లను అతివేగంగా నడపటం, త్రిబుల్ రైడింగ్ చెయ్యటం, రోడ్డు భద్రత నిబంధనలు పాటించక పోవటం ప్రమాదాలకు కారణం అన్నారు. వేసవి సెలవులు కావడంతో బంధువుల పిల్లలు రావటం వారితో పాటు సరదాగా గడపాలనే ఉదేశ్యంతో చిన్నారులు ఈత సరదతో సమీపంలోని కాలువలు, నదీ తీర ప్రాంతాలు, చెరువులు వద్దకు వెల్లుతుంటారని తెలిపారు. కుటుంబ సభ్యులు పిల్లలను గమనించు కోవాలన్నారు. ఒక్క క్షణంలో జరిగే పొరపాటు జీవితాల్లో పెను విషాదం కలిగిస్తాయని తెలిపారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా కృషి చేయాలన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో దివ్యాంగులకు ముమ్మరంగా సంక్షేమ పథకాలు

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : వైసీపీ ప్రభుత్వంలో దివ్యాంగులకు ముమ్మరంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని దివ్యాంగుల వైసీపీ నాయకుడు చల్లా రామయ్య తెలిపారు. బాపట్ల కలెక్టరేట్ రోడ్‌లో ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. చల్లా రామయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహ న్‌రెడ్డి వికలాంగులకు పింఛన్లు, అమ్మఒడి, ఇళ్ళ స్థలాలు అర్హులైన అందరికి సంక్షేమ పథకాలు వాలంటీర్ వ్యవస్థ ద్వారా అందజేస్తున్నారని తెలియజేశారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీ ద్వారా ఫించన్లు అందక చాలా ఇబ్బందులు పడ్డారని తెలిపారు. చంద్రబాబు దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ సిఎం జగన్ పైన విమర్శలు చేయటం తప్ప ప్రజల అభివృద్ధి సంక్షేమం గురించి ఎక్కడ మాట్లాడటం లేదని విమర్శించారు. అలాగే ప్రభుత్వ ఓట్లు చీలకుండా ఉండేందుకు తెలుగుదేశం పార్టీ, బీజేపీ పార్టీలకు జనసేన పార్టీ స్థాపించి నట్లుందని ఎద్దేవా చేశారు. బాపట్ల జనసేన పార్టీ నాయకులు పార్టీ ఆఫీస్‌లో జగనన్న ప్రభుత్వం వికలాంగుల ఫించన్లను తొలగిస్తున్నారని చేస్తున్న విమర్శలపై చల్లా రామయ్య తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ దివ్యాంగుల నాయకులు గుంజి ఏడుకొండలు, అక్కల కృష్ణారెడ్డి, మద్దిబోయిన శ్రీనివాసరావు, పులి నారాయణరావు,చిమటా మార్పు, చల్లాపల్లి గోపి,యార్లగడ్డ కొండమ్మ, సబ్బువరపు బాలాజీ పాల్గొన్నారు.

చంద్ర, వేములపల్లి వర్ధంతి

విశాలాంధ్ర-మంగళగిరి : శ్రీ వేములపల్లి శ్రీకృష్ణ భవన్‌లో చంద్ర రాజేశ్వరరావు, వేములపల్లి శ్రీకృష్ణ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సీపీఎం నాయకులు పిల్లలమర్రి బాలకృష్ణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మంగళగిరి పట్టణంలోని శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి గుడి ఎదురుగా ఉన్న చంద్ర రాజేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి విప్లవ జోహార్లు తెలియజేశారు. నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరపతయ్య, సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లలమర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ మహోతర త్యాగశీలి, కోట్లాది మంది కమ్యూనిస్ట్ కార్యకర్తలకు స్ఫూర్తిదాత నిగర్వి, నిరాడంబరుడు అంతర్జాతీయ కమ్యూనిస్టు దృక్పథంతో సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలను, శాంతి ఉద్యమాలను ముందుకు తీసుకెళ్ళినందుకు రాజేశ్వర రావుకు ఆర్డర్ ఆఫ్ లెనిన్ అవార్డుతో సోవియట్ యూనియన్, ఆర్డర్ ఆఫ్ డెమిట్రోవ్ అవార్డుతో బల్గేరియా, అలాగే చెకోస్లోవేకియా, మంగోలియా దేశాలు అవార్డులతో సత్కరించాయని అన్నారు. భూమిలేని నిరుపేదలకు నివేశన స్థలాలు ఇప్పించాలని దేశవ్యాప్తంగా భూ పోరాటాలకు ప్రత్యక్ష నాయకత్వం వహించి భూములను పేదలకు పంచడమే కాకుండా భూ సంస్కరణ చట్టాలను సాధించిన ఆయన త్యాగాలను కొనియాడారు. ప్రముఖ కమ్యూనిస్టు నేత వేములపల్లి శ్రీకృష్ణ 'చేయెత్తి జైకొట్టు తెలుగోడా' అనే గేయాన్ని రచించి తెలుగు ప్రజల హృదయాలలో శాశ్వతంగా నిలిచిపోయారన్నారు. సాహిత్యవేత్తగా, ఉద్యమకారుడిగా, ప్రతిపక్ష నేతగా ప్రతిభ కనబరిచిన ఆయన నేటి యువ కమ్యూనిస్టులకు స్ఫూర్తిగా నిలుస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, తాడేపల్లి సహాయ కార్యదర్శి తుడిమెళ్ళ వెంకటయ్య, మునగాల రామారావు, మానికొండ దాంగే, చిన్ని సత్యనారాయణ, జవ్వాది సాంబశివరావు, ఉడత శ్రీనివాసరావు, శ్రీను, పంతగాని మరియదాసు, సీపీఎం నాయకులు హనుమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలి

విశాలాంధ్ర-తాడేపల్లి: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు అన్నారు. ఆదివారం సాయంత్రం తాడేపల్లి స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపు ఖాయమని అన్నారు. పార్టీ కోసం కష్ట పడి పని చేయాలని పార్టీ కోసం కష్టపడే వారికి సముచిత స్థానం ఉంటుందని తెలిపారు. వివాదాలకు తావివ్వకుండా కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని అన్నారు. వచ్చే ఎన్నికల్లో మంగళగిరి నియోజకవర్గంలో లోకేష్ గెలుపు ఖాయమని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం టీడీపీ ముందు ఉంటుందని అన్నారు. నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, టీడీపీ నాయకులు దారా దాసు, ఇట్టా పెంచలయ్య, దానబోయిన సుందరరావు యాదవ్, ఒలేటి రాము, కళ్ళం బాపిరెడ్డి పాల్గొన్నారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - నిజాంపట్నం : వాసవి క్లబ్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిజాంపట్నం వారి ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి పెదకాకాని వారి సంయుక్త సహకారంతో ఆదివారం మండల కేంద్రమైన నిజాంపట్నంలోని స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంను ముఖ్య అతిథిగా ఎంపీపీ మోపిదేవి హరినాథ్ బాబు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి తరంలో వృద్ధులతో పాటుగా యుక్త, మధ్య వయసులో ఉన్న చాలా మంది కంటి సమస్యలతో బాధపడు తున్నారని అలాంటి వారి కోసం గ్రామాల్లో ఇలాంటి ఉచిత కంటి వైద్య శిబిరంను నిర్వహించి కంటి పరీక్షలు జరిపి ఉచితంగా మందులు, కళ్ళజోళ్ళు పంపిణీ చేయడంతో పాటు అవసరమైన వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయించడం ఎంతో గొప్ప విషయమని కొనియాడారు. ఈ వైద్య శిబిరంలో 295 మందికి ఉచితంగా కంటి పరీక్షలు జరిపి వారిలో 202 మందికి శస్త్ర చికిత్సలు చేయిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిజాంపట్నం చైర్మన్ కె. గౌరీ శంకర్, వైస్ చైర్మన్ కె.బాబ్జి, ఎంపీటీసీ నాజర్ ఖాన్, వాసవి క్లబ్ నిజాంపట్నం ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

ముస్లిం సోదరులకు వేగేశన ఇఫ్తార్ విందు

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : పవిత్ర రంజాన్ పండగను పురస్కరించుకుని ఉపవాసం ఉంటున్న ముస్లిం సోదరులకు బాపట్ల తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ వేగేశన నరేంద్ర వర్మ సహకారంతో ఆదివారం మండలంలోని చందోలు గ్రామంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ముస్లిం సోదరులకు రంజాన్ పండుగ సందర్భంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి మతసామరస్యాన్ని చాటుకున్నారు. 30 రోజుల కఠిన ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు రోజా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసి స్వయంగా అయన వడ్డించారు. ఈ సందర్భంగా వేగేశన మాట్లాడుతూ రంజాన్ పండుగ సర్వమత సమాన త్వానికి పత్రిక అన్నారు. కులమతాలకు అతీతంగా పండుగ చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. కుల మతాలు వేరైనా మనమంతా ఒక్కటే నోయి.. భాషలు వేరైనా భావం ఒకటేనని అందరి దైవం ఒకటే అంటూ సోదరభావంను అయన చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ ఎండీ అఫ్జల్, బాపట్ల పార్లమెంట్ మైనార్టీ అధ్యక్షుడు ఖాసిం, గ్రామ పార్టీ అధ్యక్షుడు రజాక్, టీడీపీ సీనియర్ నాయకులు సైదా, మీరా, మత పెద్దలు పాల్గొన్నారు

భక్తి శ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు

విశాలాంధ్ర - నిజాంపట్నం : క్రీస్తు ప్రభువు పునరుత్థానం చేసిన మహోన్నత రోజు ఈస్టర్ అని, క్రైస్తవులు పునరుత్థాన శక్తితో ఆధ్యాత్మికంగా పునీతులు కావాలని క్రైస్తవ మత పెద్దలు ఉద్బోధించారు. మండలంలోని అన్ని చర్చిలలో ఆదివారం ఈస్టర్ వేడుకలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అయా చర్చిలలో మత పెద్దలు ప్రత్యేక ఈస్టర్ ప్రార్థనలు, ఆరాధనలు నిర్వహించి క్రీస్తు సందేశాన్ని అందించారు. శుభ శుక్రవారం రోజున శిలువ శ్రమను, శిలువ మరణమును అనుభవించి, మూడవ దినము ఆదివారంన పునరుత్థానము అయ్యారని, ఆయన తన రక్తములతో పాపాలను కడిగి క్షమాగుణాన్ని అందించారని అన్నారు. క్రీస్తు ప్రభువు పట్ల విశ్వాసము కలిగిన వారికి ఆయన అనుగ్రహం ఎల్లవే ళలా ఉంటుందన్నారు.ప్రభువు చూపిన మార్గంలో శాంతి, సహనం, పరస్పర సహకార గుణాలతో జీవించాలని సూచించారు.

పిట్టలవానిపాలెం : క్రైస్తవులు ఈస్టర్ పండుగ వేడుకలను ఆదివారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో ఆదివారం తెల్లవారు జాము నుంచే ఆయా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్యాండిల్స్‌ను వెలిగించి క్రైస్తవ సోదర, సోదరీమణులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తు ప్రభువు పట్ల విశ్వాసము కలిగిన వారికి ఆయన అనుగ్రహం ఎల్లవేళలా ఉంటుందన్నారు. ప్రభువు చూపిన మార్గంలో శాంతి, సహనం, పరస్పర సహకార గుణాలతో అన్ని వర్గాలు జీవించాలని సూచించారు. ఏసుక్రీస్తు పునరుత్థానం గురించి క్రైస్తవ మత పెద్దలు ఉద్బోధించారు.

ఈస్టర్ సర్వమానవాళికి పండుగ

విశాలాంధ్ర - భట్టిప్రోలు : ఈస్టర్ పండుగను పురస్కరించుకుని మండలంలోని చర్చిలలో ఆదివారం ఘనంగా ప్రార్ధలనలు నిర్వహించారు. మానవ జీవిత రక్షణార్ధమై ఏసుక్రీస్తు ప్రభువు వారు శిలువలో మరణించి సమాధి చేయబడి మూడవ రోజున పునరుత్థానుడై లేచిన పవిత్రమైన ఈ రోజున ప్రపంచ వ్యాప్తంగా ఈస్టర్ పండుగను ఆత్మీయంగా జరుపుకోవడం జరుగుతుంది. ఈస్టర్ పండుగ దేవుడు ప్రభుదును లేపెను. మనలను కూడ తనశక్తి వలన లేపును అని బైబిల్ నందు పొందుపరచబడినదని పాస్టర్లు ఆయా చర్చిలలో ప్రభోదించారు. తొలుత తెల్లవారుజామున చర్చిలలో ప్రత్యేక ప్రార్ధనల అనంతరం కుటుంబీకుల సమాదులను సుందరంగా పూలమాలలతో అలంకరించి వారిని స్మరించు కున్నారు. ప్రార్ధనల్లో స్త్రీలు, పురుషులు, పెద్దలు, పిల్లలు పాల్గొని ఏసు ప్రభువును కీర్తించారు. ఈస్టర్ పండుగ సందర్భంగా చర్చిలను విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : బాపట్ల మండలం, నందిరాజుతోట గ్రామం పరిధిలోని నాగరాజు కాలువ వద్ద సుమారు 50 నుండి 55 సంవత్సరాలు వయసు కలిగిన గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైందని ఎస్సై వెంకటప్రసాద్ తెలిపారు. గ్రామ విఆర్వో పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టమ్ నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించామన్నారు. మహిళా తప్పిపోయిన వారు ఉంటే బాపట్ల రూరల్ ఎస్సై ఫోన్ : 944079 6258 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

డాక్యుమెంట్ పోయింది

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, పొదలకూరు మండలంలోని తాటిపర్తి గ్రామానికి చెందిన యేజెండ్ల మీనాక్షమ్మకు చెందిన వీలునామా డాక్యుమెంట్ పోయింది. బాపట్ల జిల్లాలోని రేణంగివరం నుండి మేదరమెట్ల గ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో ఆస్తికి సంబంధించిన 4367 నంబర్‌గల డాక్యుమెంట్ పోయింది. దొరికిన వారు కింది అడ్రస్సుకు తెచ్చి ఇవ్వగలరు.

అడ్రస్సు: యేజెండ్ల మీనాక్షమ్మ, కేరాఫ్. యేజెండ్ల శివప్రసాద్, తాటిపర్తి(గ్రామం, పోస్టు), తాటిపర్తి సచివాలయం -1, కోడ్-10990335, పొదలకూరు మండలం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.